Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 344 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 2 జనవరి 2024 | మంగళవారం | పేజీలు : 4

## 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా పనగరియా

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగరియాను 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా కేంద్రం నియమించింది. దీనితో పాటు రిత్విక్ రంజనం పాండేను కమిషన్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. 16వ ఆర్థిక సంఘం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర క్యాబినెట్ గత నెలలో అప్రూవ్ చేసింది. ఐదేళ్ల కాలానికి (2026–27 నుంచి 2030–31) సంబంధించిన రిపోర్ట్‌ను 2025 అక్టోబర్ 31లోగా రాష్ట్రపతికి కమిషన్ సమర్పించాల్సి ఉంటుంది. కేంద్రం, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీ, ఆదాయం పెంపుదలకు సంబంధించిన చర్యలను ఆర్థిక సంఘం సూచిస్తుంది. ఫైనాన్సింగ్ డిజాస్టర్ మేనేజిమెంట్ కోసం ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లపై కూడా సమీక్ష జరుపుతుంది.

# హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం




హైదరాబాద్: మెట్రో, ఫార్మా సిటీని రద్దు చేయట్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్ట్రీమ్ లైన్ చేస్తున్నామన్నారు. శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మెట్రో దూరం తగ్గిస్తామని స్పష్టం చేశారు. బీహెచ్‌ఈఎల్ నుంచి విమానాశ్రయానికి 32 కి.మీ దూరం ఉంటుందన్నారు. ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ మీదుగా విమానాశ్రయానికి మెట్రో మార్గం ఏర్పాటు చేయనున్నట్లు సీఎం పేర్కొన్నారు. నాగోల్ నుంచి ఎల్బీ నగర్, చాంద్రాయణ గుట్ట వద్ద విమానాశ్రయానికి వెళ్లే మెట్రో లైన్‌కి లింక్ చేయనున్నట్లు చెప్పారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

"అవసరమైతే మియాపూర్ నుంచి రామచంద్రాపురం, మైండ్ స్పేస్ వరకు ఉన్న మెట్రోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వరకు పొడిగిస్తాం. మేము కొత్తగా ప్రతిపాదించబోతున్న మెట్రో కారిడార్లు గత ప్రభుత్వం ప్రతిపాదించిన ఖర్చుతో పోలిస్తే తక్కువ ఖర్చుతోనే పూర్తవుతాయి" అని సీఎం వివరించారు. "ఫార్మాసిటీ, రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య జీరో కాలుష్యం తో ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక క్లస్టర్ల వద్ద పరిశ్రమల్లో పనిచేసే వారికి ఇళ్ల నిర్మాణం చేపడతాం. కార్మికులు హైదరాబాద్ వరకు రాకుండా అక్కడే అన్ని ఏర్పాట్లు చేస్తాం. యువతకు అవసరమైన నైపుణ్యాలు పెంచేందుకు ప్రత్యేక విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తాం. అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలు కలిగిన సంస్థలు, ప్రముఖ పారిశ్రామికవేత్తల ద్వారా శిక్షణ ఉంటుంది. ఈ నైపుణ్యాలకు సాధారణ డిగ్రీలకు ఉండే అర్హతలన్నీ ఉంటాయి" అని సీఎం వివరించారు.

**100 పడకల ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల..** "ఇప్పటికే అధికారాన్ని వికేంద్రీకరించాం. ఉమ్మడి జిల్లాలకు ఇంఛార్జిలుగా మంత్రులకు బాధ్యతలు అప్పగించాం. 100 పడకల ఆస్పత్రి ఉన్న చోట నర్సింగ్ కళాశాల ఉంటుంది. విదేశాలకు వెళ్లే యువతకు ఓరియంటేషన్ ఇప్పిస్తాం. ఆయా దేశాలకు అవసరమైన మ్యాన్‌పవర్‌ను ప్రభుత్వం ద్వారా అందిస్తాం. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో యువత ఉంది. వారికి ఆసక్తి కలిగిన విభాగాల్లో శిక్షణ ఇప్పిస్తాం" అని సీఎం తెలిపారు.

**నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి ఉండదు..** "మూడు కమిషనరేట్లకు కమిషనర్లను నియమించా. వారికి అవసరమైన సిబ్బందిని వారే ఎంపిక చేసుకుంటారు. శాఖలకు ప్రతిభ కలిగిన అధిపతులను నియమించడం వరకు నేను చూస్తాను. వాళ్ల పరిధిలో అవసరమైన అధికారులను నియమించుకొని యంత్రాంగం సక్రమంగా పనిచేసేలా వారే చూసుకోవాలి. అధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం కూడా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సంస్కరణలు తీసుకొచ్చి స్ట్రీమ్ లైన్ చేసే పనిలో ఉన్నాం. నా వద్ద చెప్పేది ఒకటి.. చేసేది మరొకటి ఉండదు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ నియామకం తర్వాతే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం. జర్నలిస్టులకు సంబంధించిన అన్ని సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తాం. ఇప్పటినుంచి వంద రోజుల్లో పరిష్కరిస్తాం.

**3వ తేదీన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉంది..** జనవరి 3వ తేదీన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం ఉంటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పదవులు కేటాయిస్తాం. పార్టీ కోసం పనిచేసిన వారితో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తాం. నాకు దగ్గరగా ఉంటాడనో.. లేదా బంధువనో.. పదవులు ఇవ్వడం ఉండదు. ఏది చేసినా విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పదవులు భర్తీ చేస్తాం"అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.




హైదరాబాద్: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నుమాయిష్ ప్రారంభమైంది. నుమాయిష్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సోమవారం నాడు ప్రారంభించారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. నేటి నుంచి ఫిబ్రవరి 15 వరకు నుమాయిష్ కొనసాగనున్నది. 46 రోజుల పాటు నుమాయిష్ కొనసాగనున్నది. 83 వ అల్ ఇండియా ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్‌లో దేశ, విదేశాలకు చెందిన ఉత్పత్తులతో 2400 స్టాల్స్ ఏర్పాటు చేశారు. నుమాయిష్ ఎంట్రీ టికెట్ ధర 40 రూపాయలుగా చేశారు. 5 ఏళ్ల లోపు పిల్లలకు ఫ్రీ ఎంట్రీ ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల 30 వరకు నుమాయిష్ కొనసాగుతుంది. వీక్ ఎండ్ లో రాత్రి 11 వరకు నుమాయిష్ ఉంటుంది. నాంపల్లి ఎగ్జిబిషన్‌కు వచ్చే వారికి ఫ్రీ పార్కింగ్ సదుపాయం కల్పించారు. జనవరి 9వ తేదీ ఉమెన్స్ డే సందర్భంగా ఆ రోజు మహిళకు మాత్రమే అనుమతిని కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ నేపథ్యంలో అర్ధరాత్రి 12 గంటల వరకు మెట్రో రైలు సేవలు నడవనున్నాయి. నుమాయిష్‌కు వచ్చే సందర్శకులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టారు.

# కాంగ్రెస్‌తోనే కామ్రేడ్లు!

**లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎంలతో కలసి వెళ్లనున్న అధికార పార్టీ!**
**ఇండియా కూటమిలో భాగంగా రాష్ట్రంలో పొత్తు కుదరడం లాంఛనమే**
**సీపీఎం నేతలు తనను కలసిన సందర్భంగా ఈ అంశం ప్రస్తావించిన సీఎం రేవంత్**

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీతో సీపీఐ మాత్రమే పొత్తుతో ముందుకు వెళ్లగా, లోక్‌సభ ఎన్నికల వేళ సీపీఎం కూడా జతచేరనుందా? మొత్తంగా ఉభయ కమ్యూనిస్టు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలసి పనిచేస్తాయా? పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని నిలువరించడమే ధ్యేయంగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు అధికారికంగా పొత్తు కుదుర్చుకోనున్నా యా? అంటే అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు. ఇప్పటికే జాతీయ స్థాయిలోని ఇండియా కూటమిలో భాగస్వాములైన ఈ మూడు పార్టీలు.. తెలంగాణలోనూ కలసి పనిచేస్తామని అధికారికంగా ప్రకటించడం లాంఛనమే కానుందని తెలుస్తోంది. ఇందుకు శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌తో రాష్ట్ర సీపీఎం నేతల భేటీ వేదికయిందనే చర్చ జరుగుతోంది.

**కలసి పనిచేద్దాం..** సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఎం నేతలు తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి తదితరులు కల సిన సందర్భంగా యాధృచ్ఛికంగా ఈ చర్చ వచ్చిన ట్టు తెలుస్తోంది. తమతో కలసి పనిచేయనప్పటికీ.. ప్రజల పక్షాన నిర్ణయాలు తీసుకునే క్రమంలో



మీ అభిప్రాయాలు కూడా తీసుకుంటామని, ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సీఎం రేవంత్ సీపీఎం నేతలతో అన్నారని విశ్వసనీయ సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో కలసి పనిచేయనంత మాత్రాన వేర్వేరు కాబోమని, లోక్‌సభ ఎన్నికల సమయంలో పొంచి ఉన్న బీజేపీ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు ఐక్యంగా పనిచేద్దామని ముఖ్యమంత్రి వ్యూహాత్మక ప్రతిపాదన చేశారు.

ఇందుకు స్పందించిన సీపీఎం నేతలు బీజేపీని ఎదుర్కొనే విషయంలో తమకు వేరే ఆలోచన ఉండబోదని, అయితే కాంగ్రెస్‌తో కలసి పనిచేసే అంశాన్ని పార్టీలో చర్చించి అధికారికంగా ప్రకటిస్తామని చెప్పినట్టు సమా చారం. అలాగే చేద్దామని, త్వరలోనే మళ్లీ కలసి అన్ని విషయాలు మాట్లాడుకుందామని సీఎం రేవంత్ చెప్పడంతో మరోమారు సమావేశమవు దామని వారు ఈ చర్చను ముగించినట్టు తెలిసింది. సీపీఎం నాయకులు తనను కలసిన సందర్భంగా సీఎం రేవంత్ వ్యూహాత్మకంగానే ఈ అంశాన్ని ప్రస్తావనకు తెచ్చారని తెలుస్తోంది. సీపీఎంతో తెలంగాణలో జట్టుకట్టే విషయంలో కాంగ్రెస్ సిద్ధంగా ఉందనే సంకేతాలను ఆయన ఇచ్చారని,

ఈ నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల్లో ఉభయ వామపక్షాల సహకారంతో కాంగ్రెస్ పార్టీ బరిలోకి దిగడం ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



# కాంగ్రెస్ సరికొత్త వ్యూహం

## 300 స్థానాల్లో పోటీకి సై!

## కూటమికి దిమ్మతిరిగే షాకేనా...!?

మరో మూడు నెలల్లో మొదలయ్యే సార్వత్రిక ఎన్నికల హడావుడి నేపథ్యంలో ఆ దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. అధికార బీజేపీకి బలమైన సవాలు విసిరే దిశగా కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే మిత్రపక్షాలతో కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేసి.. ఈసారి ఎన్నికల్లో అధికారాన్ని సొంతం చేసుకోవాలని తపిస్తున్న కాంగ్రెస్ తాజాగా తాను పోటీ చేసే లోక్ సభ స్థానాలపై ఒక క్లారిటీకి వచ్చింది. మొత్తం 543 ఎంపీ స్థానాల్లో తాను 300 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించిన కసరత్తును పూర్తి చేసినట్లుగా చెబుతోంది. మిగిలిన 243 స్థానాల్ని మిత్రపక్షాలకు విడిచి.. తాను వారితో కలిసి పని చేయాలన్న యోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు చెబుతున్నారు. తాము పోటీ చేయని 243 స్థానాల్లో మిత్రులకు మద్దతు ఇవ్వనున్నట్లుగా ఆ పార్టీ చెబుతోంది. గుజరాత్.. హర్యానా.. హిమాచల్ ప్రదేశ్.. మధ్యప్రదేశ్.. రాజస్థాన్.. ఉత్తరాఖండ్.. ఛత్తీస్ గఢ్.. ఒడిశా.. ఆంధ్రప్రదేవ్.. కర్ణాటక.. అసోం రాష్ట్రాల్లో బీజేపీని.. ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలను ఒంటరిగా ఢీ కొనాలని కాంగ్రెస్ భావిస్తోందని చెబుతున్నారు. అదే సమయంలో ఉత్తరప్రదేశ్.. బిహార్.. మహారాష్ట్ర.. పశ్చిమబెంగాల్.. కేరళ.. తమిళనాడు.. జార?ండ్.. ఢిల్లీ.. పంజాబ్.. తెలంగాణలలో మిత్రపక్షాలతోపొత్తు పెట్టుకొని బీజేపీని ఇతర పార్టీలను ఢీ కొనాలన్న ఆలోచనలో ఆ పార్టీ ఉన్నట్లుగా చెబుతున్నారు. సీట్ల పంపకాలపై కసరత్తు కోసం ఆయా రాష్ట్రాల పార్టీ యూనిట్లతో చర్చించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చినట్లుగా చెబుతున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 52 స్థానాల్లో మాత్రమే విజయం సాధించిన కాంగ్రెస్.. ఈసారి తాను పోటీ చేసే 300 స్థానాల్లో కనీసం సగం సీట్లలో అయినా గెలుస్తానన్న నమ్మకాన్ని కాంగ్రెస్ వ్యక్తం చేస్తోంది. అయితే.. ఆచరణలో ఎంతమేర వర్కువుట్ అవుతుందన్నది ప్రశ్నగా మారింది. గత సార్వత్రిక ఎన్నికల్లో 209 నియోజకవర్గాల్లో రెండోస్థానంలో నిలిచిన కాంగ్రెస్.. ఈ రెండు స్థానాలను కలిపితే 261 స్థానాలు అవుతాయని చెబుతున్నారు. పార్టీ గెలిచే అవకాశం లేని సీట్లలో ఆయా రాష్ట్రాల్లో గత రెండు లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చినఓట్ల ఆధారంగా తానుకానీ.. మిత్రపక్షానికి కానీ సీట్లుకేటాయించేలా చేస్తే మంచి ఫలితాన్ని సాధించొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నట్లుగా చెబుతున్నారు. ఇండియా కూటమిలోని మిత్రపక్షాలతో సీట్ల విషయంలో పేచీలకు పోకుండా.. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించటం ద్వారా పరస్పర ప్రయోజనం పొందే వీలుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరి.. మిత్రపక్షాలు ఎలా రియాక్టు అవుతాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సంపాదకీయం

## తెలంగాణ ప్రయోగం ఏపీలో ఫలించేనా..!

వచ్చే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం తోపాటు.. ప్రధాన ప్రతిపక్షం హోదా లోకి తీసుకురావాలనేది కాంగ్రెస్ పార్టీ వ్యూహం. ఈ క్రమంలోనే వైఎస్ రాజ శేఖరరెడ్డి కుమార్తె.. వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత షర్మిలను పార్టీలో చేర్చుకుని.. వెంటనే తెలంగాణలో చేసిన ప్రయోగం మాదిరి గా.. ఏపీలో నూ ఆమెకు పగ్గాలు అప్పగించాలని భావిస్తోంది. అంటే.. పొరుగు రాష్ట్రం లో చేసిన ప్రయోగాన్ని డిటో ఇక్కడ దింపేయాలన్నది కాంగ్రెస్ వ్యూహం. అయితే.. అక్కడి ప్రయోగం ఫలించ డానికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. ఒకటి.. కాంగ్రెస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి ఫైర్ బ్రాండ్‌గా ముద్రవేసుకున్నాడు. పైగా.. ఆయన స్థానికుడు. సొంతగా ఎలాంటి పార్టీ కూడా పెట్టుకోలేదు. ఇది ప్రజలకు నచ్చింది. రెండు.. అధికార పార్టీ వరుసగా పదేళ్లు రాజకీయాలు చేసింది. అయినా.. క్షేత్రస్థాయిలో అన్ని వర్గాలను ఆకట్టుకోలేక పోయింది. ఈ రెండు కారణాలు.. కలిసి వచ్చాయి. మరోముఖ్యమైన కారణం.. తెలంగాణ ఇచ్చామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ విషయంలో ప్రజలకు సింపతీ ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారు. దీనికి రేవంత్ ఫేస్ ఉపయోగపడింది. కట్ చేస్తే.. ఏపీలో ఈ మూడుకారణాలను పరిశీలిస్తే.. షర్మిల వైఎస్ తనయ అనే పేరున్నా.. ఆమె సొంతగా పార్టీ పెట్టుకున్నారు. కానీ, సక్సెస్ కాలేక పోయారు. పైగా.. తాను తెలంగాణ కోడలినని చెప్పుకొన్నారు. కాబట్టి.. ఏపీ నుంచి దూరమయ్యారు. ఒకానొక సందర్భంలో ఏపీతో తనకు పనేంటని కూడా ప్రశ్నించారు. మరో కారణం.. జగన్ విషయంలో మెజారిటీ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు సానుభూతి ఉంది. ఆయన వల్ల లబ్ధి పొందుతున్నామనే వాదన వినిపిస్తున్నారు. ఈ తరహా లబ్ధి కాంగ్రెస్ చేకూరుస్తుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇక, కాంగ్రెస్ కారణంగా ఏపీ విడిపోయి.. ఇబ్బందులు పడుతోందనే వాదన ఇప్పటికీ వినిపిస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో షర్మిలతో ప్రయోగాలు చేసినా ఫలించడం కష్టమనే భావన సర్వత్రావినిపిస్తుండడం గమనార్హం.

# భక్తుల కోలాహలంతో కళకళలాడిన ఆలయాలు



శామీర్ పేట (గరుడ వార్త) : నూతన సంవత్సరం మొదటి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో దేవాలయాల్లో వారి ఇష్ట దైవాన్ని దర్శించుకొని భక్తిని చాటుకున్నారు. సోమవారం నూతన సంవత్సరం మొదటి రోజు కావడంతో తూముకుంట మున్సిపాలిటీ, శామీర్పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలోని పలు ఆలయాలు భక్తులతో కలకల్లాడాయి. ముఖ్యంగా అలియాబాద్ గ్రామంలోని రత్నాలయంలో తెల్లవారుజామునుండే వేలాది మంది భక్తులు స్వామివారి దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. అలాగే కట్టమైసమ్మ అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని అమ్మవారికి పూజలు చేశారు. అలియాబాద్ లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు పూజలు నిర్వహించారు. దేవరయంజాల్ శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో, తూముకుంట శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, గాయత్రి మహా క్షేత్రంలో గాయత్రి అమ్మవారిని, ఉప్పరపల్లి శ్రీ పెద్దమ్మతల్లిని, శామీర్ పేట శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని, అలియాబాద్ శ్రీ సీతారామచంద్రస్వామి, ఉద్దమర్రి అక్కన్న మాదన్న దేవాలయాలు, కేశవరం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలతో పాటు ఆయా గ్రామాలలోని ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లి స్వామి వార్లను, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సంవత్సరమంతా సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుని వేడుకున్నారు.

# ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

ఎల్లప్పుడూ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి నడుస్తాం
మార్కెట్ కమిటీ వైస్ చెర్మెన్ శ్రీకాంత్ రెడ్డి



శామీర్ పేట(గరుడ వార్త) : మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లారెడ్డికి మేడ్చల్ మార్కెట్ కమిటీ వైస్ చెర్మెన్ శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకాంత్ రెడ్డి తో పాటు మేడ్చల్ నియోజకవర్గం యూత్ రూరల్ మండలాల కార్యదర్శి సంతోష్ రెడ్డి ఎమ్మెల్యేను శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# ఇరుముడితో శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు

శామీర్ పేట, (గరుడ వార్త) : అయ్యప్ప స్వామి శరణు ఘోషతో మారుమోగిన వీరభద్ర స్వామి ఆలయం. సోమవారం మండల కేంద్రం శామీర్ పేటలో అయ్యప్ప మాల ధరించి 41 రోజుల దీక్షలో భాగంగా స్వాములు వీరభద్ర స్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకున్నారు. ప్రభాకర్ గురు స్వామి ఆధ్వర్యంలో 25 మంది అయ్యప్ప దీక్ష స్వాములకు సత్యం గురుస్వామి ఇరుముళ్ళు కట్టగా శబరిమలకు బయలుదేరి



వెళ్లారు. అలాగే పద్మారావు గురుస్వామి ఆధ్వర్యంలో 9 మంది స్వాములకు సత్యం స్వామి ఇరుముడి కట్టగా శబరిమలకు తరలి వెళ్లారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప స్వామి శరణు ఘోషతో మారుమోగింది. శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు కుటుంబ సభ్యులతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది.

# యాక్సిడెంట్ దుర్ఘటన రహిత నూతన సంవత్సర వేడుకలు కొనసాగాయి

సైబరాబాద్ పోలీస్ డ్రంక్ అండ్ డ్రైవ్ పై స్పెషల్ డ్రైవ్ సత్ఫలితాలను ఇచ్చాయి
సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మోహన్తి



సైబరాబాద్ క్రైం(గరుడ వార్త) : నూతన సంవత్సర వేడుకల్లో రోడ్ యాక్సిడెంట్, ఇతర దుర్ఘటనలో నివారించేందుకు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మొహంతి చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ముఖ్యంగా ఆదివారం 31 డిసెంబర్ రాత్రి నుండి జనవరి ఫస్ట్ ఉదయం వరకు 74 సైబరాబాద్ పోలీస్ బృందాలు సైబరాబాద్ కమిషనరేట్ వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో, 1241 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వాహనదారులను గుర్తించి పట్టుకున్నట్లుగా సైబరాబాద్ కమిషనర్ తెలిపారు. వీరందరినీ కోర్టు ముందు హాజరు పరుస్తామన్నారు. దాంతోపాటుగా వారి డ్రైవింగ్ లైసెన్స్ లను మోటర్ వెహికల్ చట్టం ప్రకారం సీజ్ చేసేందుకు గాను సంబంధిత ఆర్టిఏ అధికారులకు వివరాలను సైతం అందజేయనున్నట్లుగా తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన వారిలో ఎక్కువ శాతం మియాపూర్, కూకట్పల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, నార్సింగి, జీడిమెట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలోని వారేనన్నారు. ముఖ్యంగా నగర ప్రజలు పోలీస్ సూచనలు పాటిస్తూ సహకరించినందుకు నగర ప్రజలకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి ధన్యవాదాలు తెలిపారు. వాహనదారుల భద్రతతో పాటుగా, వారి పరిసరాల వ్యక్తుల భద్రత రిత్యా ప్రమాదకరమైన, నిర్లక్ష్యంగా వాహనాలను నడపవద్దని వాహనదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మోహన్తి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# చెరువులు కప్పేస్తూ కట్టడాలు

కామారెడ్డి: నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో చెరువులు అన్యాక్రాంత మవుతున్నా.. అడ్డుకునేవారు లేరు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు వెలుస్తున్నా.. అడిగేవారుండరు. పురపాలకశాఖ ఏమీ చూడకుండా ఇంటి నంబర్లు జారీ చేస్తోంది. వాటిని అడ్డంపెట్టుకొని విద్యుత్తు కనెక్షన్లు తీసుకుంటున్న పరిస్థితి ఉంటోంది. బఫర్ జోన్ నిబంధనలు, జలవనరులశాఖ నుంచి నిరభ్యంతర పత్రాలు లేకుండానే కానిచ్చేస్తున్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం ఆక్రమణలకు బలం చేకూరుస్తోంది.

కబ్జా కోరల్లో

నిజామాబాద్ నగరం నాగారం పరిధి సర్వే నంబరు 2999లోని బొందెం చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఏడాదిన్నర కిందట జలవనరుల, నీటిపారుదల, రెవెన్యూ అధికారులు చుట్టూ హద్దుగా కందకం తవ్వించినా.. అది పూడుకుపోయింది. రెండు దిక్కులా బండరాళ్ల గుట్ట ఉంది. మిగతా రెండు వైపులా నిర్మాణాలు వెలవడంతో 23.7 ఎకరాల ఈ జలవనరులోకి నీరు చేరే అవకాశమే లేకుండా పోయింది. ఫలితంగా పిచ్చిమొక్కలతో మైదాన ప్రాంతంగా మారింది. ఈ క్రమంలోనే చుట్టుపక్కల నిర్మాణాలు విస్తరించుకుంటూ శిఖంలోకి చొచ్చుకొస్తున్నాయి.

నిబంధనల ఊసేది..?

ఇంటి నిర్మాణాల అనుమతి జారీలో నిబంధనలు పాటించటం లేదు. ఇష్టానుసారం డోర్ నంబర్లు జారీ చేస్తున్నారు. విద్యుత్తుశాఖ పూర్తిస్థాయి అనుమతిలేని నిర్మాణాలకు కనెక్షన్లు జారీ చేస్తోంది. నిజానికి నీటివనరులున్న ప్రాంతాల్లో 9 మీటర్ల దూరం వరకు ఎటువంటి కట్టడాలకు అనుమతివ్వవద్దు. జలవనరులశాఖ నుంచి నిరభ్యంతర పత్రం జత చేయాల్సి ఉంటుంది. అలాంటివి లేకుండానే మున్సిపల్ వారు అనుమతులిస్తుండటంతో అక్రమ నిర్మాణాలకు అంతులేకుండా పోతోంది.సమన్వయం మాటే లేదు..

బొందెం చెరువు ప్రాంతంలో గతంలో హద్దులు నిర్ణయించి ట్రెంచ్ కొట్టించామని దక్షిణ మండలం తహసీల్దారు ప్రసాద్ చెప్పారు. ఇక్కడ చేపట్టే నిర్మాణాలకు మున్సిపల్ వారు నిబంధనలు చూసి అనుమతిలివ్వాలన్నారు. జలవనరులశాఖ నిరభ్యంతర పత్రం తప్పనిసరి అని తెలిపారు. వారే చెరువు పరిరక్షణకు ఫెన్సింగ్ చేయించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నీటిపారుదలశాఖ అధికారి రాజ్యలక్ష్మి స్పందిస్తూ... తాము ఎవరికీ నిరభ్యంతర పత్రాలు ఇవ్వటం లేదని చెప్పారు. నిర్మాణాలు చేపట్టడం, విద్యుత్తు లైన్లు వేయటం అనేది మున్సిపల్, విద్యుత్తుశాఖల వారు నిబంధనలు చూసి ఇవ్వాలని చెప్పుకొచ్చారు.

మరిన్ని ఉదంతాలు..నిజామాబాద్ శివారులోని రామర్తి చెరువులోకి నిర్మాణాలు వచ్చేశాయి. నిద్ర నుంచి మేల్కొన్న అధికారులు వాటిని ఏమీ చేయలేక.. మిగిలిన భాగాన్నైనా కాపాడేందుకు ఫెన్సింగ్ వేయించారు. చెరువు విస్తీర్ణం కుంచించుకుపోవడం వల్ల వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదతో తక్కువ సమయంలోనే నిండిపోయి నిజామాబాద్–బోధన్ రహదారిపైకి నీరు చేరుతోంది. ః భీమ్‌గల్ పట్టణానికి ఆనుకొని ఉన్న రాథం, మొగిలి చెరువులది ఇదే పరిస్థితి. రాథం 72 ఎకరాల విస్తీర్ణం ఉండగా.. 20 ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది. ఇటీవల సర్వే చేయించిన రెవెన్యూ యంత్రాంగం తదుపరి చర్యలను మరిచింది. మొగిలి విస్తీర్ణం కాగితాలకే పరిమితమైంది. సింహభాగం నిర్మాణాలు వెలిశాయి. ః మాక్లూర్ మండలం గుత్ప ప్రాంతంలోని మూడు చెరువులు 100, 60, 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఖజానా చెరువులో 20 ఎకరాలు, నడి, పెచ్చెరువుల్లో పదేసి ఎకరాలు కబ్జాకు గురయ్యాయి.

# రాచకొండకు పూర్వ వైభవం వచ్చేనా?



చౌటుప్పల్ : హైదరాబాద్‌కు యాభై కిలోమీటర్ల దూరంలోనే ఉన్న రాచకొండ.. 14వ శతాబ్దంలో 115 ఏళ్లపాటు రాజధానిగా కొనసాగినందున ఓ గొప్ప పర్యాటక కేంద్రంగా మారే బదులు 'అనాథ' లా మారింది. ఎందరో వీరులకు, కవులు, కళాకారులకు నిలయమై జనరంజకంగా పాలన సాగిన రేచర్ల 'పద్మనాయక పాలన బహుమనీ సుల్తానుల దండయాత్రతో 1475లో అంతమైందని, బహుమనీల గవర్నర్‌గా నియమితుడైన శితాబ్‌ఖాన్ సైతం రాచకొండను కేంద్రంగా చేసుకుని పాలించాడని చరిత్రకారుల మాట. ఇంతగొప్ప రాచరిక, చారిత్రక, సాంస్కృతిక వారసత్వమున్న రాచకొండను తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తొలి సంవత్సరంలోనే 2014 డిసెంబరులో సీఎం కేసీఆర్ సందర్శించారు. ఆనాటి చారిత్రక కట్టడాలను హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వేలో ఆయన వీక్షించారు. సుమారు పది వేల ఎకరాల్లో విస్తరించిన ఒకనాటి తెలుగు రాజులు పాలించిన రాచకొండకు కేసీఆర్ పూర్వ వైభవం తెస్తారని ఎనిమిదేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు.శత్రు దుర్భేద్యంగా నిర్మించిన రాచకొండ కోట చుట్టూ చైనా గోడను తలపించే విధంగా గుట్టలను కలుపుతూ భారీ రాళ్లతో నిర్మించిన ప్రాకారాలు ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. ఆరొందల అడుగుల ఎత్తయిన కచేరీ కొండపై నిర్మించిన రాజస్థానాన్ని చేరాలంటే ఏడు ద్వారాలను, వాటికి పహారా ఉండే సైనికులను దాటుకుని వెళ్లేలా నిర్మించిన రక్షణ వ్యవస్థ అబ్బుర పరుస్తుంది. కొండపైకి వెళ్లేందుకు రాతితోనే నిర్మించిన మెట్లు ఇప్పటికీ ఆనవాళ్లుగా మిగిలాయి. పద్మనాయకులు వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చారని, పంటలకు నీటి వనరుల కోసం ఆనాడు తవ్వించిన చెరువులు అనపోత సముద్రం, రాయ సముద్రం, నాగసముద్రం నేటికీ జలాలతో నిండుగా ఉండడం విశేషం. పరిపాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని సీమలుగా విభజించి దుర్గాధిపతులను నియమించారు. దేవరకొండ దుర్గాన్ని, దేవాలయాలను నిర్మించారు. పద్మనాయకుల పాలనలో వస్త్రాల తయారీ, కలంకారీ, అద్దకపు పరిశ్రమ కూడా ఉండేది. ఇంత గొప్ప చారిత్రక వారసత్వాన్ని రక్షించే ప్రయత్నాలు ఇక్కడ జరగడం లేదు.

కవులు, కళాకారులకు నిలయం

రాచకొండ రాజ్యంలో సంస్కృత భాషకు ఆదరణ ఉండేది. పద్మనాయకుల ఆస్థానంలో కొలువుదీరిన తెలుగు కవుల్లో గౌరన, పోతన ప్రసిద్ధులు. పోతనామాత్యులు రాజు కోరికపై భోగినీ దండకం రచించారు. పరమేశ్వరార్పణగా మహాభాగవత రచన ప్రారంభించారు. ఆ కావ్యాన్ని రాజుకు అంకితమివ్వడానికి నిరాకరించారు. రాజాస్థానాన్ని ఆశ్రయించి జీవించుట హేయమని భావించి జన్మస్థలం బమ్మెర చేరి హాలిక వృత్తిలో జీవించారు. మహాకవి శ్రీనాథుడు రాచకొండను సందర్శించి సన్మానం పొందారు. ఇక్కడ కవులకు, కళాకారులకు గౌరవముండేది. రాచకొండ రాజ్యంలో అంతర్భాగంగా ఉండే గోలకొండ, భువనగిరి, ఓరుగల్లు, పోతన జన్మస్థలం బమ్మెర తదితర ప్రదేశాలను చారిత్రక వారసత్వ సంపదగా గుర్తించి ప్రభుత్వం పర్యటక కేంద్రాలుగా అభివృద్ధి పరుస్తున్నది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశమ వార్షికోత్సవాల సందర్భంగానైనా రాచకొండ ప్రాభవాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# మార్కెట్లకు మహర్దశ పట్టేనా?

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ మార్కెట్లకు మహర్దశ పట్టేనా అని రైతులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేతశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు పదవీ బాధ్యతలు స్వీకరించడంతో రైతులు, వ్యాపారులు, కార్మికవర్గాలు ప్రధానంగా ఈ మార్కెట్‌పై దృష్టి పెట్టాయి. ఎన్నికల సమయంలో ఆయన ఖమ్మం మార్కెట్లో ప్రచారం చేసినప్పుడు విపరీతమైన తుమ్ములతో ఇబ్బంది పడ్డారు. ఎలాంటి కాలుష్యం లేకుండా రైతులకు, కార్మికులకు, వ్యాపారులకు నూతన హంగులతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మిర్చి మార్కెట్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలు కల్పిస్తామని ఇటీవల ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖల మంత్రులుగా పని చేసిన టి.హరీశ్‌రావు సిద్ధిపేటలో రూ.100 కోట్లతో మోడల్ మార్కెట్ నిర్మించారు. అలాగే నిరంజన్‌రెడ్డి వనపర్తిలో నూతన మార్కెట్ ఏర్పాటు చేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. ఇక్కడ ఏడాదికి సుమారు 30 లక్షల బస్తాల మిర్చి, 10 నుంచి 15 లక్షల బస్తాల పత్తి నిల్వలు వస్తాయి. వీటికి తోడు అపరాల కొనుగోళ్లు పెద్ద ఎత్తున జరుగుతాయి. ఏటా సుమారు రూ.2 వేల కోట్ల నుంచి రూ.2,500 కోట్ల వ్యాపారం జరుగుతుంది. మొత్తం వ్యాపారులు, హమాలీలు, కార్మికులు, ఇతర వర్గాలు కలిపి 3,500 మంది దీనిపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తారు. ఇప్పుడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మార్కెట్లపై ప్రత్యేక దృష్టి పెట్టి మరింత అభివృద్ధి చేస్తారని ప్రజలు ఆసక్తిగా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక కృషితో ఖమ్మం మార్కెట్‌కు మంజూరైన



సుమారు రూ.12 కోట్ల నిధులతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

పాలకవర్గాల్లేక నిర్వీర్యం.... ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక మార్కెట్లకు పాలకవర్గాలు లేకపోవటంతో ప్రత్యేక అధికారుల పాలనలోనే ఉన్నాయి. ఒక్కో అధికారికి రెండు, మూడు మండలాల బాధ్యతలు అప్పగించటంతో అక్కడ పర్యవేక్షణ సరిగాలేదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పీసా చట్టం ఆధారంగా ములుగు జిల్లాలో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఏజెన్సీ పరిధిలో ఉన్న మార్కెట్లన్నీ పాలకవర్గాల్లేక కునారిల్లుతున్నాయి.

ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, నేలకొండపల్లి, వైరా, మధిర వ్యవసాయ మార్కెట్లకు మాత్రమే పాలకవర్గాలున్నాయి. మద్దుపల్లి, ఏన్కూరు, కల్లూరు, సత్తుపల్లి మార్కెట్లకు లేవు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, బూర్గంపాడు, ఇల్లెందు, భద్రాచలం, చర్ల, దమ్మపేట మార్కెట్లకు ఏళ్ల నుంచి పాలకవర్గాల్లేవు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇవీ సమస్యలు

సరిపోయినంత మంది ఉద్యోగులు లేకపోవటం, ఖమ్మం మార్కెట్ చుట్టుపక్కల ఉన్న గోదాములు వినియోగంలో లేకపోవటం, మార్కెట్లలో సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉండటం

# సన్న రకాల సాగుకే ఆసక్తి

చేగుంట: ఏటా యాసంగి సీజన్‌లో రైతులు దొడ్డు రకాలను సాగుచేస్తుంటారు. ఈసారి మాత్రం చాలామంది సన్న రకాలు వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో సన్న రకం ధాన్యంతోపాటు బియ్యానికి మంచి గిరాకీ ఉంది. గతంలో ఎన్నడూ లేనంతగా ధర పలుకుతుండడంతో అటువైపు దృష్టి సారిస్తున్నారు.

జిల్లాలో 2.86 లక్షల ఎకరాల్లో సాగు అంచనా..

జిల్లావ్యాప్తంగా యాసంగి సీజన్‌లో 2.86 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. రైతుల బోర్లలో నీరు పుష్కలంగా ఉండడంతోపాటు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. దీంతో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుత యాసంగిలో సుమారు 40 శాతం సన్నాలే సాగు చేయనున్నారు. గతంలో యాసంగిలో కేవలం 5- 15 శాతమే సాగయ్యేది. ఇప్పుడు సాగు విస్తీర్ణం పెరగనుంది. చేగుంట, నార్సింగి, మెదక్, చిన్నశంకరంపేట, రామాయంపేట, నిజాంపేట, నార్సింగి, వెల్దుర్తి, హవేలిఘనపూర్, పాపన్నపేట, నర్సాపూర్, శివ్వంపేట, కొల్చారం, కౌడిపల్లి, చిలప్‌చెడ్, మాసాయిపేట, తూప్రాన్ మండలాల్లో సన్నవాటి సాగువైపే మొగ్గుచూపి నాట్లకు



సిద్ధమవుతున్నారు.

ధరలు పెరగడంతో..

సన్న ధాన్యంతోపాటు బియ్యానికి డిమాండ్ అమాంతం పెరిగింది. దీంతో రైతులు వాటివైపు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా జైశ్రీరాం, ఆర్‌ఎన్‌ఆర్, హెచ్‌ఎంటీ సోనామసూరి సాగుచేస్తున్నారు. ప్రభుత్వం దొడ్డు రకానికి క్వింటాలుకు రూ.2,203 మద్దతు ధర ఇస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో సన్న రకాలకూ అదే ధర ఉంటుంది. బయట మార్కెట్లో, రైస్‌మిల్లుల్లో విక్రయిస్తే సన్న రకం క్వింటాలుకు రూ.3 వేల వరకు వస్తోంది. సన్న రకాలు చాలావరకు వానాకాలంలో మాత్రమే సాగుచేస్తుంటారు. యాసంగి సీజన్‌లో దిగుబడి తగ్గడంతోపాటు నూకలు ఎక్కువగా అవుతుంటాయి. సన్నాలకు ధర బాగుండడంతో తక్కువ దిగుబడి వచ్చినా వాటినే ఎక్కువగా సాగుచేస్తున్నారు.

# చెత్త సమస్యకు పరిష్కారం



గోదావరిఖని : గత దశాబ్దకాలంగా రామగుండం నగరపాలిక ఎదుర్కొంటున్న డంపింగ్ యార్డు సమస్యకు మోక్షం లభించింది. డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించాలంటూ గత దశాబ్దకాలంగా రెవెన్యూ అధికారులను నగరపాలక అధికారులు కోరుతూనే ఉన్నారు. పీకే రామయ్య కాలనీ సమీపంలో రామునిగుండాల గుట్ట వద్ద డంపింగ్ యార్డు కోసం రెవెన్యూ అధికారులు స్థలాన్ని చూపించగా స్థానికుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. లక్ష్మీపురం సమీపంలోని ఖాళీ స్థలంలోకి నగరపాలిక చెత్తను తరలిస్తుండగా స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో మానేశారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం రామగుండంలో డంపింగ్ యార్డుతో పాటు చెత్త నిర్వహణ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోగా స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అధికారికంగా సింగరేణి యాజమాన్యం స్థలాన్ని అప్పగించకపోయినా సుందిళ్ల సమీపంలోని సింగరేణి స్థలాన్ని నగరపాలిక డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తూ వచ్చింది. అధికారికంగా అప్పగిస్తే డంపింగ్ యార్డును అభివృద్ధి చేయడంతో పాటు చెత్త నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని నగరపాలక అధికారులు పలుమార్లు కోరినా స్పందన రాలేదు. సుమారు రెండేళ్ల క్రితం ఉపరితల గని విస్తరణలో భాగంగా డంపింగ్ యార్డుగా వాడుకుంటున్న స్థలాన్ని సైతం సింగరేణి స్వాధీనం చేసుకుంది. ఇక అప్పటి నుంచి బల్దియాకు డంపింగ్ యార్డు సమస్య తలనొప్పిగా మారింది. ఎట్టకేలకు రెవెన్యూ, సింగరేణి సమన్వయంతో సుందిళ్ల సమీపంలో అయిదు ఎకరాల స్థలాన్ని కేటాయించడంతో సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. సంబంధిత స్థలాన్ని అధికారికంగా అప్పగించాల్సి ఉండగా నాలుగైదు రోజులుగా నగరంలోని చెత్తను అక్కడికే తరలిస్తున్నారు. గత రెండేళ్లుగా నగరంలోని చెత్తను తరలించేందుకు స్థలం లేదు. ఎక్కడైనా ఖాళీ స్థలం కనిపిస్తే నగరంలోని చెత్తను సిబ్బంది అక్కడికి తరలించేవారు. స్థానికులనుంచి వ్యతిరేకతలు రావడం... గోదావరి ఒడ్డున నివాసాలు లేకపోవడంతో నదీ తీరం వద్దకు చెత్తను తరలించారు.

దీంతో పవిత్ర గోదావరి నది కలుషితం కావడంతో పాటు పుణ్యస్నానాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బంది పడేవారు. ఓ వైపున హిందూ శ్మశానవాటిక, మరో వైపు సమ్మక్క సారలమ్మ జాతర స్థలం ఉండటంతో స్థానికులకు ఇబ్బందులు తప్పలేదు. చెత్తను కాల్చివేయడంతో వ్యాపించే పొగతో రాజీవ్ రహదారిపై వెళ్లే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో గోదావరి ఒడ్డున చెత్త వేయవద్దంటూ పర్యావరణ ప్రేమికులు, వివిధ సంఘాల నాయకులు నిరసనలు వ్యక్తం చేయడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రస్తుతం సుందిల్ల సమీపంలో సింగరేణి యాజమాన్యం డంపింగ్ యార్డు కోసం అయిదు ఎకరాల స్థలం కేటాయించగా గోదావరి సమీపంలో మరో అయిదు ఎకరాల స్థలాన్ని కేటాయించనున్నట్లు సమాచారం.

# కాలువ నీరు.. సాగుకు దన్ను



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో ప్రస్తుత యాసంగిలో రైతులు వరిని ప్రధాన పంటగా పండిస్తుండగా ప్రధాన ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు నీటి విడుదలతో పంటల సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతున్నట్లు వ్యవసాయశాఖ తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. శ్రీరామసాగర్, మధ్యమానేరు, దిగువ మానేరు తదితర జలాశయాల నుంచి ఆయకట్టుకు ఇటీవల నీటిని వదలగా వరదకాలువలోనూ నిల్వ చేస్తుండటం పంటల సాగుకు ప్రధాన ఆదరువుగా మారింది. మరోవైపు మండలాల్లో సగటు భూగర్భ జలమట్టం 1.71 మీటర్ల నుంచి 4.29 మీటర్ల వరకుండటం పంటల సాగుకు కలిసివస్తోంది. కరీంనగర్ జిల్లాలో అన్ని పంటల సాధారణ సాగు 2.46 లక్షల ఎకరాలుగా అంచనా వేయగా ఇప్పటివరకు 25 వేల ఎకరాల్లో పంటలను విత్తుకున్నారు. పెద్దపల్లిలో 1.83 లక్షల ఎకరాల సాధారణ సాగుకుగాను 13 వేల ఎకరాల్లో పంటలను విత్తుకున్నారు. జగిత్యాల జిల్లాలో 2.81 లక్షల ఎకరాల సాధారణ సాగుకు 47 వేల ఎకరాల్లో, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.31 లక్షల సాధారణ సాగుకుగాను 20 వేల ఎకరాల్లో పంటలు సాగులోకి వచ్చాయి.నాలుగు జిల్లాల్లోనూ 6.48 లక్షల ఎకరాల్లో వరిసాగును అంచనా వేయగా ఇప్పటివరకు 33 వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తిచేశారు. నీటివనరులు సమృద్ధిగా ఉండటంతో ఇంకనూ చాలా గ్రామాల్లో వరినార్లు పోస్తున్నారు. ఫిబ్రవరి మొదటివారం వరకు వరినాట్లకు అవకాశం ఉండటంతో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. నేరుగా వెదజల్లి విత్తటం, డ్రమ్‌సీడరు ద్వారా గింజలను నేరుగా విత్తటం తదితర పద్ధతులనూ చాలామంది రైతులు అనుసరిస్తున్నారు. గడచిన వానాకాలంలో 9.65 లక్షల ఎకరాల్లో వరిని సాగుచేయగా ప్రస్తుత యాసంగిలో దాదాపుగా 7.50 లక్షల ఎకరాలకు వరిసాగు చేరుకునే అవకాశముందని అంచనా వేస్తున్నారు.ఉమ్మడి జిల్లాలో 52 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటివరకు 35 వేల ఎకరాల్లోనే విత్తుకున్నట్లు గుర్తించారు. జనవరి నుంచి నువ్వు పంట సాగుకు అదనుండగా దాదాపుగా 30 వేల ఎకరాల్లో ఈ పంటను పండించనున్నారు. ఇప్పటికే పెసర, మినుము, కూరగాయలు, అలసంద, జొన్న, సజ్జ, వేరుసెనగ, ఆవాలు తదితర పంటలను రైతులు పండిస్తుండగా మరికొన్నింటిని వేసవి పంటలుగా జనవరి నుంచి విత్తుకునే అవకాశముంది. మరోవైపు ఆయిల్‌పామ్ మొక్కల నాటు ఈ సీజన్ చివరిలోపు దాదాపుగా 50 వేల ఎకరాలకు చేరనుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత యాసంగిలో అన్ని రకాల పంటలను రైతులు గరిష్ఠ విస్తీర్ణంలో పండించే అవకాశముందని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు.

# గాడితప్పిన సమయపాలన

సూర్యాపేట : ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా ప్రతి ఒక్క అధికారి, కింది స్థాయి సిబ్బంది పూర్తిస్థాయిలో పని చేయాల్సిందే. అప్పుడే పథకం ప్రజలకు చేరి సర్కారు ఆశయం నెరవేరుతోంది. జిల్లాలో కీలకమైన కలెక్టరేట్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సరైన సమయానికి విధులకు వస్తేనే ఆయా కార్యక్రమం అమలు కావడానికి ఆస్కారం ఉంది. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్లో విధులు నిర్వర్తిస్తున్న కొందరు సిబ్బంది అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా శాఖల్లో చేపట్టే పనులు ఆలస్యమవుతున్నాయి. వారు విధులకు ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. దీన్ని నివారించేందుకు బయోమెట్రిక్ ఏర్పాటు చేయాల్సిన ఉన్నా నేటికీ అందుబాటులోకి తీసుకురాకపోవడం విశేషం.

పాత కలెక్టరేట్లో బయోమెట్రిక్ అమలు

సూర్యాపేట జిల్లా ఆవిర్భవించిన తర్వాత దురాజ్‌పల్లిలోని అద్దె భవనంలో కలెక్టరేట్ను నడిపించారు. అక్కడ విధులు నిర్వర్తించిన 36 శాఖలకు సంబంధించిన కార్యాలయాల్లో సుమారు 150 ప్రభుత్వ, 60 మంది వరకు ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వర్తించారు. అక్కడ అధికారులకు మినహా మిగతా వారికి బయోమెట్రిక్ విధానం అమలులో ఉండేది. దీంతో సరైన సమయానికి విధులకు హాజరయ్యేవారు. గత ప్రభుత్వం నూతన కలెక్టరేట్ను నిర్మించడంతో ఆగస్టులో ఇక్కడికి మారారు. అక్కడి కార్యాలయాలతోపాటు అదనంగా మరికొన్ని శాఖలకు ఇక్కడ గదులు కేటాయించారు. ఇది జరిగి నాలుగు నెలలవుతున్నా నేటికీ నూతన కలెక్టరేట్లో బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేయలేదు. దీంతో సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. విధులకు సమయానికి హాజరుకాకున్నా సంబంధిత శాఖల జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు ఆరోపణలకు తావిస్తోంది.

మధ్యాహ్నం ఇంటి బాట!

నూతన కలెక్టరేట్లో మొత్తం 43 శాఖల జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో జిల్లాకు సంబంధించిన మొత్తం అధికారులు, సిబ్బంది ఇక్కడే



పని చేస్తున్నారు. అన్ని కార్యాలయాల్లో కలిపి సుమారు 320 మంది వరకు పని చేస్తున్నారు. ఇందులో చాలా వరకు నల్గొండ జిల్లా కేంద్రం నుంచి బస్సుల్లో వచ్చి వెళ్తున్నారు. అందులో కొందరు సరిగా విధులకు రాకుండా జిల్లా అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి హాజరు నమోదు చేయించుకుంటున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలో ఉంటూ విధులకు వచ్చే కొందరు సిబ్బంది మధ్యాహ్నం వరకే వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కొత్తగా కొలువు దీరిన ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. ఇవి సరైన సమయానికి లబ్ధిదారులకు చేరుతాయో... లేదో అన్న సందిగ్ధం నెలకొంది. పాలనాధికారి చొరవ తీసుకుని బయోమెట్రిక్ విధానాన్ని సక్రమంగా అమలయ్యేలా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో ఏర్పాటు చేస్తాం- సుదర్శన్‌రెడ్డి, ఏవో, సూర్యాపేట

పాత కలెక్టరేట్లో బయోమెట్రిక్ విధానాన్ని సక్రమంగా అమలు చేశాం. త్వరలో ఇక్కడ కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. విధులకు సరైన సమయానికి రాని వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉంది.

# అధ్వాన దారులు... తప్పని అవస్థలు!

బుగ్గారం : బుగ్గారం నుంచి రాయపట్నం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. మద్దునూరు శివారులో కల్వర్టు పది సంవత్సరాలుగా రాళ్లు తేలి ప్రమాదకరంగా తయారైంది. దీంతో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడికి సమీపంలో రహదారి కోతకు గురవడంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణం చేస్తున్నారు. చెట్ల కొమ్మలు రహదారి మీదికి రావడం మూల మలుపులు ఎక్కువగా ఉండటంతో తీవ్ర అవస్థలు పడుతూ ప్రయాణం చేస్తున్నామని వాహన చోదకులు అంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ మరమ్మతు పనులకు మోక్షం రావడం లేదు.

రోడ్డువిస్తరణ పనులతో..గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ నుంచి వెల్గటూరు మండలంలోని స్తంభంపల్లి మధ్య సుమారు అయిదు నెలల క్రితం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గొల్లపల్లి నుంచి లక్షెట్టిపేట, మంచిర్యాల వైపు వెళ్లే వారికి ఇది దగ్గరి మార్గం కావడంతో చాలా మంది ఇక్కడి నుంచి ప్రయాణం సాగిస్తారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా తవ్వి కంకరతో నింపారు. ఈ మార్గంలో చిల్వాకోడూర్ నుంచి లొత్తునూర్ వరకు సుమారు 4 కి.మీ వరకు కంకర తేలి ఉండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో కొద్ది మంది లొత్తునూరు వైపు వెళ్లే వారు మరో మార్గమైన గొల్లపల్లి మీదుగా సుమారు 15 కి.మీ ప్రయాణించి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు పనుల్లో పెంచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణం నాస్తి.. మరమ్మతులు జాస్తి

స్తంభంపల్లి నుంచి లొత్తునూరు వెళ్లే రహదారి పలు చోట్ల ప్రమాదకరంగా ఉంది. కొన్నిచోట్ల కోతకు గురి కావడంతో అధ్వాన్నంగా



తయారైంది. దీనికి తోడు ఇరువైపులా దట్టంగా చెట్ల కొమ్మలు రహదారి మీదికి రావడంతో వాహనదారులు భయంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రమాదకరంగా మూల మలుపులుండటం రహదారి సరిగా లేకపోవడంతో తాము అవస్థలు పడుతున్నామని వాహన చోదకులు అంటున్నారు.

నత్తనడకన పనులు జైన నుంచి దొంతాపూర్ వెళ్లే రహదారి సంవత్సరాల తరబడి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైన మూల మలుపు, మగ్గిడి శివారు లోలెవల్ వంతెనల వద్ద రహదారి అంత్యంత ప్రమాదకరంగా ఉంది. కల్వర్టులకు రెండు వైపులా చదునుగా లేక గుంతగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు అదుపు తప్పుతున్నాయి. మరమ్మతు పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మెరుగైన రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

గండి పడిన ప్రాంతాల్లో ప్రమాదాలు

ధర్మపురి నుంచి బీర్‌పూర్ వరకు గల 12 కి.మీ.ల రహదారి అధ్వానంగా మారింది. కోరండ్లపల్లె వద్ద గత వానా కాలంలో భారీ వర్షాలతో రహదారిపై గండి పడింది. ప్రతిరోజు వందలాది వాహనాలు ఇదే రహదారి నుంచి కమ్మునూర్ వరకు వెళ్లుంటాయి. మధ్యన నక్కలపేట, దోనూర్, తీగలధర్మారం, బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్, కొల్వాయి, తాళ్లధర్మారం, కమ్మునూర్ వరకు రహదారి విస్తరించి ఉంది. గండిపడిన ప్రాంతంలో రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి మరమ్మతు చేసేందుకు ప్రతిపాదలను పంపించారు. నిధులు విడుదల కాకపోవడంతో మరమ్మతులు కరవయ్యాయి. కోతకు గురైన రహదారికి మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# రైతుబంధు అందేదెన్నడు?

ఖమ్మం :యాసంగి పెట్టుబడి సాయం 'రైతుబంధు' పథకం నత్తనడకన సాగుతోంది. ఈ నెల 12 నుంచి రైతుల ఖాతాల్లో పాత పద్ధతిలోనే కొత్త ప్రభుత్వం ఈ నిధులను జమ చేస్తోంది. గతంలో పంట పెట్టుబడి వెంట వెంటనే రైతులు ఖాతాల్లో జమయ్యేది. ఇప్పుడు చాలామంది ఖాతాల్లో జమ చేయటంలో జాప్యం జరుగుతోంది. ఎకరం లోపు రైతులు జిల్లాలో మొత్తం 1,28,000 మంది ఉన్నారు. కానీ 95,802 మంది అన్నదాతల ఖాతాల్లో నాటికి రూ.24.78 కోట్లు మాత్రమే జమయ్యాయి. ఎకరం లోపు ఇంకా చాలామంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కావాల్సి ఉంది. అనేక మంది పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. గత వానాకాలం సీజన్‌లో మొత్తం 3,29,892 మంది రైతుల ఖాతాల్లో రూ.362.92 కోట్లను ప్రభుత్వం జమ చేసింది. ఇప్పుడు కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో ఎకరం లోపు రైతులు 1.28 లక్షల మంది, 2 ఎకరాల్లోపు



85 వేల మంది, పోడు రైతులు 11,511 మంది ఉన్నారు. ఈ సంవత్సరం కొత్త రైతులు 6,780 మందికి రైతుబంధు పథకం మంజూరు చేశారు. దీనిపై నిత్యం అనేక మంది కర్షకులు వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తున్నారు. అందరి ఖాతాల్లో పెట్టుబడి సాయం నిధులు జమవుతాయని అధికారులు చెబుతున్నారు. రైతుబంధు నిధులు యాసంగి సీజన్‌కు ఆదుకుంటాయని రైతులు భావిస్తున్నారు. ఆలస్యం కావడం వల్ల అసంతృప్తికి గురవుతున్నారు. డిసెంబరులో కొత్త ప్రభుత్వం ఎకరాకు రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని ప్రకటించింది. కౌలు రైతులు, ఇతర రైతులకు సంబంధించిన పూర్తి వివరాలు తీసుకున్న తర్వాత వచ్చే వానాకాలం సీజన్ నుంచి ఎన్నికల్లో వాగ్దానం చేసిన ప్రకారం మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇంతవరకు వ్యవసాయశాఖ అధికారులకూ దీనిపై స్పష్టత లేదు.

# ఆదాయం నొక్కేసి.. సౌకర్యాలు కప్పేసి

సూర్యాపేట : వార సంతల్లో క్రయవిక్రయదారులు సమస్యలతో సతమతమవుతున్నారు. వేలం ద్వారా ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా అధికారులు వసతుల కల్పనపై దృష్టిసారించటం లేదు. పాట దక్కించుకున్న గుత్తేదారులు ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు సంత నిర్వహణ హక్కు పొందుతారు. వీరికి ఆదాయం పొందుతూ నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 పశువుల సంతలుండగా.. వాటిలో నల్గొండలో ఐదు, యాదాద్రిలో నాలుగు, సూర్యాపేటలో ఆరు ఉన్నాయి. అన్నింటినీ గ్రామ శివారులో నిర్వహిస్తున్నారు. అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేక దూరప్రాంతాల నుంచి వచ్చే రైతులు, వ్యాపారులు నరకయాతన పడుతున్నారు. వర్షానికి తడుస్తూ.. చలిలో వణుకుతూ.. ఎండకు ఎండుతూ కొనుగోలు సాగిస్తున్నారు. వేసవిలో దాహార్తికి తాళలేక తహతహలాడుతుంటారు. కనీసం నీడ వసతి లేక ఎండలో మండిపోతున్నారు. విద్యుత్తు సౌకర్యంతోపాటు పరిసరాలను పరిశుభ్రం చేయాల్సి ఉన్నా పట్టించుకునే వారు కరవు.

యాదాద్రి భువనగిరి జిల్లాలో..బీబీనగర్ మండలం కొండమడుగులో మంగళవారం పశువుల సంత నిర్వహిస్తారు. ఏడాదికి రూ.60లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఇక్కడికి నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాల నుంచి రైతులు, వ్యాపారులు వచ్చి పశువులు క్రయవిక్రయాలు జరుపుతారు. నిలువ నీడ లేదు. తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ సౌకర్యాలు లేవు.ఆత్మకూర్(ఎం)లో 25 ఏళ్ల క్రితం సంత ఏర్పాటు చేశారు. ఏడాదికి రూ.లక్షకుపైగా ఆదాయం వస్తున్నా తాగునీరు, షెడ్లు, ప్రహరీ సమస్యలు నెలకొన్నాయి. బీ యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం జరిగే సంతకు ఏడాదికి రూ.4లక్షలకు వేలం పాడారు. నీటితొట్లు చెత్తాచెదారంతో నిండిపోయాయి. తాగునీరు,



మూత్రశాలలు లేవు.

సూర్యాపేట జిల్లాలో..సూర్యాపేటలో వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి పశువుల సంత నిర్వహిస్తారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతవాసులు ఎక్కువగా వచ్చి క్రయవిక్రయాలు సాగిస్తుంటారు. వారానికి రూ.80వేలపైగా ఆదాయం సమకూరుతుంది. షెడ్లు, తాగునీటి వసతి, మూత్రశాలలు లేవు. నీటితొట్లు ఉన్నా నిర్వహణ లేక అధ్వానంగా మారాయి.తిరుమలగిరిలో వేలం ద్వారా ఏడాదికి రూ.12.55 లక్షల ఆదాయం సమకూరుతోంది. బుధవారం సంత నిర్వహిస్తారు. షెడ్లు, తాగునీటి వసతి లేవు.

నూతనకల్ మండలం మిర్యాలలో ప్రతి ఆదివారం సంత నడుస్తుంది. వేలం ద్వారా రూ.8.50లక్షల ఆదాయం వస్తోంది. ఇక్కడ స్థలం లేకపోవటంతో రహదారిపైనే నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో వార సంతకు వేలం ద్వారా రూ.36.36లక్షల ఆదాయం వచ్చింది. ఇక్కడ స్థలం లేకపోవటంతో ఇళ్ల మధ్య కొనసాగిస్తున్నారు. తాగునీటి వసతి, మరుగుదొడ్లు లేవు. తుంగతుర్తి, కోదాడలో సంతలున్నా పశువుల క్రయవిక్రయదారులు రాకపోవటంతో మూసివేశారు.

నల్గొండ జిల్లాలో..కొండమల్లేపల్లిలో ప్రతి ఆదివారం జరిగే సంత ఉమ్మడి జిల్లాలోనే పేరుగాంచింది. ఇక్కడ ఎలాంటి వసతులు లేవు. వేలం ద్వారా ఏడాదికి రూ.1.20 కోట్లు ఆదాయం వస్తోంది. క్రయవిక్రయదారులకు తాగునీటి వసతి, షెడ్లు, మహిళలు, పురుషులకు మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు.

నార్కట్‌పల్లిలో రూ.40.15లక్షలకు పాట దక్కించుకున్నారు. ప్రతి శుక్రవారం సంత జరుగుతుంది. షెడ్లు, తాగునీటి వసతి లేక క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కట్టంగూర్‌లో ఏడాదికి రూ.26 లక్షల ఆదాయం వస్తుంది. శనివారం జరిగే సంతలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, నీడ సదుపాయంలేక ఇక్కట్లు తప్పడం లేదు.చండూరులో జరిగే సంత ద్వారా ఏడాదికి రూ.40 లక్షలు ఆదాయం సమకూరుతోంది. స్థలం లేకపోవటంతో రహదారి పక్కనే నిర్వహిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేవు.

మిర్యాలగూడ పరిధిలోని అవంతీపురంలో మంగళవారం, శనివారం సంత నిర్వహిస్తారు. రూ.40వేల ఆదాయం సమకూరుతుంది. ఇక్కడ సదుపాయాలు ఉన్నాయి.

వసతులు కల్పిస్తాం

– నాగేశ్వరశర్మ, జిల్లా మార్కెటింగ్ అధికారి, సూర్యాపేట

జిల్లాలోని పశువుల సంతల్లో క్రయవిక్రయదారులకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పిస్తాం. ఈ విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. అనుమతులు రాగానే సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

## కుదరని ఏకాభిప్రాయం... అవిశ్వాసానికి జాప్యం

భువనగిరి : భువనగిరి పురపాలకులపై ప్రకటించిన అవిశ్వాసంపై మూడు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. సమావేశానికి తేదీని ఖరారు చేయాలని కలెక్టర్‌ను కలవాలన్న నిర్ణయంపై మూడు పార్టీల నాయకులు వేర్వేరుగా సమావేశాలు నిర్వహిస్తుండటంతో అడుగు ముందుకు పడటం లేదు. పురపాలక కార్యవర్గంలో 35 మంది కౌన్సిలర్లు ఉన్నారు. భారాసకు 20 మంది, కాంగ్రెస్‌కు తొమ్మిది, భాజపాకు ఆరుగురు ఉన్నారు. ప్రస్తుతం భారాసలోని 15 మంది అసమ్మతిని ప్రకటిస్తూ మరో తీర్మానం లేఖపై సంతకాలు చేశారు. వీరికి తోడుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు. భాజపా కౌన్సిలర్లు సంతకాలు చేయనప్పటికి నలుగురు కౌన్సిలర్లు ఈ ప్రక్రియకు మద్దతు తెలిపేందుకు ముందుకు వచ్చారని తెలిసింది. భారాస, కాంగ్రెస్, భాజపాల మధ్య పదవుల పంపకంపై ఏకాభిప్రాయం కుదరడం లేదని తెలిసింది. పదవులకు పేర్లు ఖరారైతేనే అవిశ్వాసం ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ భావిస్తోంది. భారాస అసంతృప్త కౌన్సిలర్లు, కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిస్తే 24 మంది అవుతున్నారు. భారాసలో ఛైర్మన్ పదవిని ఆశిస్తున్న వారికి తాము ఎలా మద్దతు ఇస్తామని కొందరు కాంగ్రెస్ కౌన్సిలర్లు, అధినాయకులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. భారాసకు మద్దతు ఇచ్చి అధికారంలో ఉన్న తాము ఎలా తలెత్తుకుని తిరగాలని కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తుండటంతో ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో మూడుసార్లు చర్చలు జరిపినప్పటికి ఎమ్మెల్యే ఏ నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. వారిని గద్దె దించిన తదుపరి రెండు పదవులపై నిర్ణయం తీసుకుందామని అన్ని పార్టీల కౌన్సిలర్లు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# బుద్వేల్ లేఅవుట్ అభివృద్ధికి రూ.400 కోట్లు ఎలా?



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో జరిగిన భూ వేలంలో అత్యంత ధర పలికిన బుద్వేల్ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పన మరింత జాప్యమయ్యేలా కనిపిస్తోంది. ఈ భూముల అమ్మకం ద్వారా వచ్చిన భారీ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరింది. అప్పటి అవసరాలకు హెచ్ఎండీఏ నిధులన్నీ ప్రభుత్వం తీసుకుంది. నిబంధనల ప్రకారం లేఅవుట్‌లో రహదారులు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్తు సౌకర్యం ఇతరత్రా మౌలిక వసతులన్నీ హెచ్ఎండీఏనే కల్పించాలి. వంద ఎకరాలోని ఈ వెంచర్‌లో మౌలిక వసతులు కల్పించాలంటే రూ.350–400 కోట్లు వరకు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ లేఅవుట్‌లో 100 ఎకరాలు పెద్ద గుట్టపై ఉన్నాయి. ఇందులో పెద్దపెద్ద బండరాళ్లు పేరుకుపోవడంతో భారీ యంత్రాలతో వాటిని తొలగించాలి. ఇతర పనులన్నీ 18 నెలల్లో పూర్తి చేయాలి. వేలంపాట పూర్తయ్యి ఆరు నెలలు దాటింది. గతంలో కోకాపేట లేఅవుట్‌లోనూ మౌలిక వసతుల కల్పనకు రూ.450 కోట్లు వెచ్చించారు. అప్పట్లో నిధులకు ఎలాంటి ఆటంకం లేకుండా చేసినా.. పనుల్లో జాప్యం తప్పలేదు. ప్రస్తుతం బుద్వేల్ లేఅవుట్‌కు సంబంధించి ఇంకా టెండర్ల దశే దాటక పోవడంతో నిర్ణీత సమయంలో మౌలిక వసతుల కల్పన అనేది కష్టమేనని అధికారులే అంటున్నారు. ముఖ్యంగా ఈ వెంచర్ ద్వారా వచ్చిన నిధులన్నీ ప్రభుత్వ ఖాతాకు చేర్చిన అప్పటి కీలకాధికారి... వసతులకయ్యే నిధులనైనా హెచ్ఎండీఏ ఖాతాకు కేటాయించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని పేర్కొంటున్నారు.

బడా సంస్థల నుంచి భారీ స్పందన...

కోకాపేట మాదిరిగానే బుద్వేల్‌లోనే భూముల ఈ–వేలానికి అప్పట్లో భారీ స్పందన వచ్చింది. నగరానికి సమీపంలోని రాజేంద్రనగర్ బుద్వేల్ గుట్టపై ఉన్న 100 ఎకరాలను ఈ ఏడాది మేలో హెచ్ఎండీఏ వేలం వేసిన సంగతి తెలిసిందే. మొత్తం 14 ప్లాట్లుగా కేటాయించి భూమిని విక్రయించారు. వంద ఎకరాలకుగాను హెచ్ఎండీఏ రూ.2000.20 కోట్లు ఆప్‌సెట్ ధర నిర్ణయించగా...ఒకటిన్నర రెట్లు రూ.3625.73 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరింది. కోకాపేట్ మాదిరిగానే ఇక్కడ బహుళ నిర్మాణాల జోన్ కింద కేటాయించడం...ఏఏఐ అనుమతులకు లోబడి ఈ వెంచర్‌లో కూడా అపరిమితమైన అంతస్తులు నిర్మించుకునే అవకాశం ఉంది. మౌలిక వసతుల తర్వాత ఈ వెంచర్‌కు మరింత డిమాండ్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

# జలాశయ మరమ్మతు.. ఉపాధి గల్లంతు



మంథని : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరి నదిపై మేడిగడ్డ వద్ద లక్ష్మి, సుందిళ్ల వద్ద పార్వతీ బ్యారేజీలు నిర్మించారు. రెండు జలాశయాల్లో చేపల వేటపై ఆధారపడి స్థానికంగా వందలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. గతంలో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు బ్యారేజీల నిర్మాణం తర్వాత స్వగ్రామాలకు చేరుకొని చేపల వేటతో జీవిస్తున్నారు. కొద్ది నెలల కిందట బ్యారేజీ నిర్మాణ లోపాలు వెలుగుచూశాయి. దీంతో మరమ్మతులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బ్యారేజీలోని నీటిని ఖాళీ చేస్తున్నారు. దీంతో వీటిపై ఆధారపడిన గంగపుత్రులు, ముదిరాజ్ వర్గీయులు ఆందోళన చెందుతున్నారు. మేడిగడ్డను సందర్శించే రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ ఉపాధికి చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

9 గ్రామాల్లో 500 మంది..

మంథని మండలం సిరిపురం వద్ద గోదావరిపై నిర్మించిన పార్వతి(సుందిళ్ల) బ్యారేజీపై ఆధారపడి పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని బెస్తపల్లి, సింగిరెడ్డిపల్లి, ముస్యాల, సుందిళ్ల, జనగామ, బెజ్జాల, ముద్దులపల్లి, కుందారం, శెట్‌పల్లి గ్రామాలకు చెందిన 500 మందికి పైగా మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. బ్యారేజీలో చేపల వేటతో రోజుకు రూ.500 నుంచి రూ.1000 వరకు ఆదాయం వస్తోందని వారు చెబుతున్నారు. ఒక్కో మత్స్యకారుడికి రోజూ 8 నుంచి 10 కిలోల చేపలు లభ్యమవుతున్నాయి.

నాడు వలసలు ఇక్కడి మత్స్యకారులు గతంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో చేపలు పట్టేవారు. స్థానికంగా సరిపడా పని లేక చాలా మంది ముంబయి, పుణే నగరాలతో పాటు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లేవారు. సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం తర్వాత వారంతా తిరిగి స్వగ్రామాలకు చేరుకొని చేపల వేటతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. కాగా బ్యారేజీ మరమ్మతుల కోసం కొద్ది రోజులుగా నీటిని దిగువకు వదులుతున్నారు. అన్ని గేట్లను ఎత్తడంతో చేపలు కొట్టుకుపోతున్నాయని, దీంతో జీవనోపాధి కరవై రోడ్డున పడాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు.

గేట్లను తక్కువ ఎత్తుకు ఎత్తాలి

14 ఏళ్లుగా గోదావరిలో చేపల వేట ఆధారంగా కుటుంబాన్ని పోషిస్తున్నాను. మరమ్మతు పేరుతో బ్యారేజీలోని మొత్తం నీటిని దిగువకు వదులుతున్నారు. అధికారులు గేట్లను ఎక్కువ ఎత్తుకు ఎత్తకుండా చర్యలు తీసుకోవాలి. నీటిని నెమ్మదిగా వదిలితే గుంటల్లో చేపలు మాకు దొరుకుతాయి. వచ్చే వానాకాలం సీజన్ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం లేనందున మాకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి.

–బోండ్ల రాజమల్లు, బెస్తపల్లి

గల్ఫ్ నుంచి వచ్చా..

స్వగ్రామంలో పని లేక గతంలో గల్ఫ్ వెళ్లి దాదాపు పదేళ్లు అక్కడే ఉన్నాను. ఇక్కడ బ్యారేజీలు నిర్మించడంతో గల్ఫ్ నుంచి వచ్చి చేపల వేటతో జీవనం సాగిస్తున్నాను. జలాశయం నీటిని పూర్తిగా కిందికి వదిలితే ఆర్థికంగా చితికిపోతాం. బ్యారేజీలో చేపల వేట తప్ప మరో ఆధారం లేదు. మళ్లీ గల్ఫ్ వీసా కావాలంటే రూ.లక్ష వరకు అవసరం. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

–రాజేశం, సింగిరెడ్డిపల్లి

చదువు ఆపి చేపలు పడుతున్నా

డిగ్రీ వరకు చదివిన నేను ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చదువు ఆపేశాను. కుటుంబ పోషణ కోసం ఈ వృత్తిని ఎంచుకున్నాను. మూడేళ్లుగా పార్వతి బ్యారేజీలో చేపలు పడుతున్నా. ఇపుడు ఏం చేయాలో తెలియడం లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి. –మేడి రాజశేఖర్, సింగిరెడ్డిపల్లి

కుటుంబాలు రోడ్డున పడతాయి

గతంలో కూలీ పనులకు వెళ్లేవాళ్లం. బ్యారేజీ నిర్మాణం తర్వాత మాకు స్థానికంగా ఉపాధి లభించింది. మా కుటుంబంలో 20 మందిమి చేపల వేటపై ఆధారపడి బతుకుతున్నాం. బ్యారేజీలో నీటిని పూర్తిగా కిందికి వదిలితే ఉపాధి లేక మా కుటుంబాలు రోడ్డున పడతాయి.

–నర్సయ్య, బెస్తపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి

మా గ్రామంలో దాదాపు అన్ని కుటుంబాలు చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. బ్యారేజీ మొత్తం ఖాళీ చేస్తే తీవ్రంగా నష్టపోతాం. గతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గం.ల వరకే చేపలు పట్టేవాళ్లం. బ్యారేజీ నిర్మాణం తర్వాత ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గం.ల వరకు చేపలు పట్టి అమ్ముకుంటున్నాం. బ్యారేజీ నిండాలంటే మరో 6 నెలలైనా పడుతుంది. ప్రభుత్వం ఆదుకోవాలి. –తోకల నర్సయ్య, బెస్తపల్లి

# నిరుపయోగంగా ఎత్తిపోతల పథకం

గోదావరిఖని : రెండు వేల ఎకరాల బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్న తలంపుతో మల్లాపూర్ మండలం ఒబులాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సోమేశ్వర ఎత్తిపోతల పథకం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. ఒబులాపూర్ గ్రామ శివారులో గోదావరి నదిపై 1991లో 2వేల ఎకరాల బీడు భూములకు సాగునీటిని అందించాలన్న లక్ష్యంతో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో నాలుగు సంవత్సరాల పాటు సాగునీటిని అందించారు. అనంతరం పథకానికి సంబంధించి విద్యుత్తు బకాయిలు భారీగా పేరుకుపోవడంతో పథకం కాస్తా మరుగున పడింది. ఏళ్ల తరబడి పట్టించుకోకపోవడంతో నీటిని ఎత్తిపోసే విద్యుత్తు మోటార్లు చెడిపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. గోదావరి నదికి సమీపంలో ఉన్న రైతులు నదిలో మోటార్లను ఏర్పాటు చేసుకుని కొంతమేర వ్యవసాయం చేసుకుంటుండగా, నదికి దూరంగా ఉన్న భూములు ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉంటున్నాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం స్పందించి ఎత్తిపోతల పథకాలకు మరమ్మతు పనులు చేపట్టి బీడు భూములు సాగులోకి వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

# ఆర్థిక ప్రణాళిక

మిర్యాలగూడ : ఒకప్పుడు ఇతరుల వద్ద అప్పు తీసుకోవాలంటే.. ఎవరు ఏమనుకుంటారోనని ఎంతో సంశయించే వారు. అత్యవసరమైతే తప్ప అప్పు తీసుకునేవారు కాదు. ప్రస్తుతం కాలం మారింది.. మనుషులు డబ్బు చుట్టూ పరిగెడుతున్నారు. ఎంత సంపాదించినా అది ఖర్చులకే సరిపోతున్నాయి. మరోవైపు పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా.. అనేక మంది తమ స్థోమతకు మించి ఖర్చులు చేస్తూ.. అప్పుల్లో చిక్కుకుని కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. ఇటువంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలోనూ అనేకం వెలుగు చూస్తూనే ఉన్నాయి.అన్నింటా అవగాహన..మొదటి నుంచి సరైన ఆర్థిక ప్రణాళిక ఉంటే భవిష్యత్తు ఆనందమయంగా ఉంటుందంటున్నారు నిపుణులు. తమ ఆదాయానికి తగినట్లుగా ప్రణాళిక సిద్ధం చేసుకుని ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, బీమా చెల్లింపులతో పాటు కొంత డబ్బు పొదుపు చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. అవసరమైన, అత్యవసరమైన ఖర్చుల ను గుర్తించి.. వాటికి ఎంత మేర నగదు ఖర్చు చేయాలో సరైన నిర్ణయం తీసుకునేలా అవగాహన పెంచుకోవాలి. మరో వైపు అధిక డబ్బు సంపాదించాలనే ఆశతో ఆన్‌లైన్‌లో వివిధ రకాల ఆటలు, పందేలు వేసి అసలుకే మోసపోతున్న కుటుంబాలు ఇటీవల కాలంలో అనేకం.

రుణాలపై అప్రమత్తత అవసరం..

ప్రస్తుతం మారిన ఆర్థిక పరిస్థితులు, వివిధ సంస్థల మధ్య పోటీ నేపథ్యంలో ఎటువంటి కష్టం లేకుండా ఇంటి వద్దకే వచ్చి రుణాలు ఇచ్చే సంస్థలు ఎన్నో ఉన్నాయి. ఆయా సంస్థల సిబ్బందికి ఉన్న టార్గెట్ల కారణంగా.. ప్రజలపై ఒత్తిడి తెచ్చి అవసరం లేకున్నా.. రుణాలు ఇస్తున్నారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్‌లో రుణాలు తీసుకుని అవి



చెల్లించలేక యువత ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు. దీంతో పాటు పలు ఫైనాన్స్ సంస్థలు ఇంట్లో వస్తువుల కోసం సులభంగా రుణాలు అందిస్తూ.. నెలవారీ వాయిదాల్లో వసూలు చేస్తున్నాయి. ప్రస్తుతం మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ఇళ్లలో నెలవారీ వాయిదాలు చెల్లించే వారు లేరనేది నమ్మలేని నిజం.

అవసరమైనదే కొనాలి..

ఉమ్మడి జిల్లాలోని నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి వంటి పట్టణాల్లో షాపింగ్ మాల్స్ అనేకం వచ్చాయి. గతంలో మనం ఏదైనా అవసరం ఉండి దుకాణానికి వెళ్తే అదే కొనుక్కుని వచ్చే వాళ్లం. ప్రస్తుతం ఈ మాల్స్ రంగప్రవేశంతో ఏదైనా ఒక వస్తువు కోసం అక్కడికి వెళ్తే.. ఆ మాల్‌లో ఉండే 'ఒకటి కొంటే మరొకటి ఉచితం', ' ప్రత్యేక తగ్గింపు ధరలు' వంటి ఆఫర్లకు ఆకర్షితులై జనం అవసరం లేకపోయినా ఇతర వస్తువులు కొనుగోలు చేసి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ అనవసర ఖర్చును తగ్గించడంతో సగటున నెలకు రూ.రెండు నుంచి మూడు వేలకు పైగానే ఆదా అవుతుందని నిపుణులు చెబుతున్నారు.ఈ ఏడాది జూన్‌లో చౌటుప్పల్‌లో ఓ మహిళ ఆన్‌లైన్ ఆటల్లో డబ్బు పోగొట్టుకుని అవమానం భరించలేక తన ఇద్దరు పిల్లల్ని హత్య చేసి.. తాను ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విధంగా ఆన్‌లైన్ ఆటలు, ఆన్‌లైన్ రుణాలతో డబ్బు పోగొట్టుకుని ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న వారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది.

మిర్యాలగూడకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులైన భార్యాభర్తలు.. సొంత ఇంటి కొనుగోలుకు రుణం తీసుకుని తమ వేతనాల్లోంచి నెల నెలా అప్పు చెల్లిస్తున్నారు. వాయిదాలు పోను మిగిలే నగదు ఇంటి ఖర్చులు, వైద్య చికిత్సలకు సరిపోకపోవడంతో మళ్లీ అప్పులు చేయాల్సి వచ్చింది. దీనికంతటికీ కారణం.. తమకు వస్తున్న వేతనం, ఇంటి కొనుగోలుకు చేయాల్సిన విషయంలో సరైన ప్రణాళిక లేకపోవడమే.

## గొలుసు దుకాణాలపై ఖాకీల పంజా

చండూరు : గ్రామాల్లో మంచినీరు దొరకని దుకాణం ఉంటుందేమో కానీ.. మద్యం సీసా దొరకని దుకాణం ఉండదంటే అతిశయోక్తి కాదేమో.. ఇంట్లో పూటగడవకపోయినా తాగుడుకు మాత్రం అప్పులు చేస్తున్నారు. పల్లెల్లో గొలుసు దుకాణాలు వీధికొకటి వెలుస్తున్నాయి. దీంతో మద్యానికి బానిసై కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. యువత కూడా తాగుడుకు అలవాటు పడిపోయారు. మద్యానికి బానిసై చదువు మధ్యలోనే ఆపేస్తూ జులాయిగా తిరుగుతున్నారు. వీటన్నింటికి గొలుసు దుకాణాలే కారణమని నియోజకవర్గంలో వాటిని పూర్తిగా నిషేధించాలని స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిర్ణయించారు. ఇప్పటికే ఆబ్కారీ, పోలీస్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు.

కమిటీల ఏర్పాటుకు చర్యలు...గొలుసు దుకాణాలను స్వచ్ఛందంగా మూసి వేయించేందుకు పార్టీలకతీతంగా గ్రామాల వారీగా కమిటీలను



ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. దానికి గొలుసు దుకాణాల నిర్మూలన కమిటీ పేరును నామకరణం చేశారు. ఏ గ్రామంలో అయితే పూర్తిగా మద్యాన్ని నిర్మూలిస్తారో తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు గ్రామాల్లో గొలుసు దుకాణాలు నిర్వహించొద్దని దండోరా వేయిస్తున్నారు. ముందుగా హెచ్చరికలు జారీ చేయాలని వినని పక్షంలో కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లోని గొలుసు దుకాణాలపై పోలీస్ శాఖ, ఆబ్కారీ శాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. పలు దుకాణాలపై రెండు శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు.

కేసులు తప్పవు–వెంకటయ్య, సీఐ, చండూరు

సర్కిల్ పరిధిలో గ్రామాలు, పట్టణాల్లో గొలుసు దుకాణాలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నట్లుగా తెలిస్తే మాకు సమాచారం ఇవ్వండి. గొలుసు దుకాణాల్లో మద్యం విక్రయిస్తే ఉపేక్షించేది లేదు.

# పారిశ్రామిక రంగం కొత్త పుంతలు..!

మహబూబ్‌నగర్: తెలంగాణ ఏర్పడిన తర్వాత పాలమూరులో పారిశ్రామిక రంగం కొత్త పుంతలు తొక్కింది. ఇటీవల మహబూబ్‌నగర్ శివారులోని దివిటిపల్లిలో 262 ఎకరాల్లో రూ.9,500 కోట్లతో ఏర్పాటు చేయనున్న అమరరాజా బ్యాటరీస్ గిగా కారిడార్‌కు శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే 10వేల మందికి ఉపాధి లభించనుంది. మరో ఐదెకరాల్లో రూ.40కోట్లతో నిర్మించిన ఐటీ టవర్ భవనాన్ని ప్రారంభించారు. దీని ద్వారా నాలుగేళ్లలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల ఉద్యోగాలే లక్ష్యంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు ముందుకొచ్చాయి. 2014లో రాష్ట్రం ఏర్పాటు చేసిన తర్వాత ప్రభుత్వం పరిశ్రమల స్థాపన కోసం టీఎస్‌ఐపాస్ ఏర్పాటు చేసింది. పాలమూరు జిల్లాల్లో మహబూబ్‌నగర్ శివారులోని ఐటీ, మల్టీపర్పస్ ఇండస్ట్రీస్ కారిడార్, జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ, జడ్చర్ల, గద్వాల, పాలెం పారిశ్రామికవాడలున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని ఎల్ఐజీ హౌజ్, నంచర్లలో పారిశ్రామికవాడల అభివృద్ధికి టీఎస్‌ఐఐసీ స్థలాలను కేటాయించింది. 2015 నుంచి ఉమ్మడి జిల్లాకు 665 యూనిట్లు వచ్చాయి. ఈ పరిశ్రమల్లో రూ.12,540 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

మెరుగవుతున్న సేవలు..

2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోనే మొదటి వైద్య కళాశాలను మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ కళాశాలను పీజీకి అప్‌గ్రేడ్ చేశారు. జిల్లా ఆస్పత్రిని జనరల్ ఆస్పత్రిగా మార్చారు. ప్రస్తుతం 650 పడకలతో వివిధ సేవలందిస్తున్నారు. మరోవైపు పాత కలెక్టరేట్ స్థానంలో రూ.500 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో ఉంది. జిల్లాలుగా మారడంతో నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట, వనపర్తి ప్రాంతీయ ఆస్పత్రులను జిల్లాస్థాయి ఆస్పత్రులుగా మార్చారు. కొత్తగా నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు వైద్య కళాశాలలు వచ్చాయి. జిల్లా ఆస్పత్రులను 100 పడకల నుంచి 380 పడకలకు మార్చారు. జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలకు కూడా మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లాలో ఐదు వైద్య కళాశాలలకు ప్రభుత్వం



రూ.2,500 కోట్లు కేటాయించింది. ఐదు జిల్లాలకు నర్సింగ్ కళాశాలలను మంజూరు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల, అచ్చంపేటలో ఇటీవలే వంద పడకల ఆస్పత్రులు ప్రారంభించారు. జిల్లాలోని బాలానగర్, కోయిల్‌సాగర్‌లో 30 పడకలతో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆమ్రాబాద్, ఉప్పునుంతల మండలాల్లో 30 పడకల ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. నారాయణపేట జిల్లాలో చిన్న పిల్లల ఆస్పత్రి ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంతోపాటు కొల్లాపూర్‌లో మతాశిశు సంరక్షణ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి.

ఉన్నత విద్య వైపు అడుగులు..

పాలమూరు జిల్లాల్లో విద్యారంగంలో పలు మార్పులొచ్చాయి. ప్రధానంగా ఉన్నత విద్యకు ప్రాధాన్యం లభిస్తోంది. ఒకప్పుడు ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ కళాశాలలకే పరిమితమైన ఈ జిల్లాల్లో ఉన్నత విద్య సంస్థలకు అడుగులు పడ్డాయి. వనపర్తి జిల్లాకు జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల వచ్చింది. రాష్ట్రంలో నాలుగో కళాశాల ఈ ప్రాంతానికి రావడం గమనార్హం. పాలమూరు యూనివర్సిటీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టారు. పీయూ పరిధిలో కొత్తగా ఎంబీఏ, ఎంసీఏ, ఎంఏ(తెలుగు) కోర్సులు ప్రారంభించారు. వనపర్తిలో మైక్రోబయోలజీ, కొల్లాపూర్‌లో స్టాటిస్టిక్స్, గద్వాలలో ఎంబీఏ కోర్సులను ప్రవేశపెట్టారు. నారాయణపేట జిల్లాలోని ధన్వాడ, మక్తల్‌కు డిగ్రీ కళాశాలలు ఏర్పాటయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు ఉద్యానవన పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది. రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి జిల్లాలో 35 గురుకులాలుంటే వాటి సంఖ్య ప్రస్తుతం 105కు పెరిగింది. గతంలో మైనార్టీ గురుకులాల్లేవు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉమ్మడి జిల్లాలో 30 వరకు మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేయడం విశేషం. 'మన ఊరు–మన బడి'లో మహబూబ్‌నగర్ జిల్లాలో 291 పాఠశాలలు, నాగర్‌కర్నూల్–290, వనపర్తి–183, జోగులాంబ గద్వాల–161, నారాయణపేటలో 174 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత పాలమూరు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ పాఠశాలలను ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,188 పాఠశాలలున్నాయి. అందులో 3.51 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2లక్షల మంది విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నారు.

సాంకేతిక విద్యపైనా దృష్టి సారించాలి

తెలంగాణా రాష్ట్రం ఏర్పాటయ్యాక పెద్దఎత్తున గురుకుల విద్యాసంస్థలు ఏర్పాటు చేయడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజన, వసతి సౌకర్యాలు సమకూరాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో కూడా ఇంజినీరింగ్, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే నడిగడ్డకు న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం సాంకేతిక, వృత్తి విద్యాసంస్థలను పెద్దఎత్తున నెలకొల్పాల్సిన అవసరం ఉంది.

హంపయ్య, గద్వాల

వైద్యరంగంలో మెరుగైన అభివృద్ధి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్య కళాశాలను ప్రారంభించారు. డయాలసిస్ కేంద్రాలు అందుబాటులోకి రావడం శుభపరిమాణం. జనరల్ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను భర్తీ చేస్తే రోగులకు మరిన్ని సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా అత్యవసర వాహనాల సంఖ్య మరింత పెంచాలి. సర్కారు దవాఖానాల్లో వైద్యుల జవాబుదారీతనం పెంచాలి.

పద్మావతి, నాగర్‌కర్నూల్

పెట్టుబడులు ఆకర్షించాలి..

యువతరానికి ఉద్యోగ కల్పన, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, అందుబాటులో ఉన్న వనరులను ఆదర్శవంతంగా వినియోగించుకోవడం ద్వారా వృద్ధి అవకాశాలు మరింత పెరుగుతాయి. పారిశ్రామిక రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించాలి. పట్టణ, గ్రామీణ యువతరానికి ఉపాధి అవకాశాలు సృష్టించేలా ఉత్పాదక రంగాలపై దృష్టి కేంద్రీకరించాలి. నిరంతర విద్యుత్తు లభ్యత, పారిశ్రామికాభివృద్ధిలో అత్యంత ప్రధానం. పాలమూరు హైదరాబాదుకు సమీపంలో ఉండటం అన్ని విధాలుగా పారిశ్రామికాభివృద్ధికి ఉపయుక్తంగా ఉంటుంది.డా.ఎం.అనురాధరెడ్డి, కామర్స్ విభాగాధిపతి, పీయూ

# వివాదానికి పరిష్కారం దొరికేనా!



నిజామాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం జరగనుంది. హైదరాబాద్‌లోని రూసా భవనంలో ఉదయం 11 గంటలకు సభ్యులు భేటీ కానున్నారు. ముందస్తుగా నిర్ణయించిన సమావేశమైనప్పటికీ.. వర్సిటీలో నెలకొన్న వివాదాలకు పరిష్కారాలు కనుగొనే అవకాశం ఉంటుందా..? అనే చర్చ సాగుతోంది. పాలకమండలి నియమించిన రిజిస్ట్రార్ ఆ బాధ్యతలకు దూరంగా ఉంటున్నారు. ఉపకులపతి నియమించిన రిజిస్ట్రార్ అధికారిక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. మే నెల వేతనాల బిల్లులపై ఆయన సంతకాలు చేశారు. ప్రస్తుతం అవి బ్యాంకుకు చేరాయి. అయితే రిజిస్ట్రార్ విషయంలో గత నెల ఇదే సమయానికి రిజిస్ట్రార్ ఎవరనే విషయంలో సందిగ్ధతతో బ్యాంకు వారు బిల్లులను అనుమతించని విషయం తెలిసిందే. మళ్లీ అదే పరిస్థితులు నెలకొన్నాయి. బ్యాంకు వారు వాటిని అనుమతిస్తారా..తిరస్కరిస్తారనేది సోమవారం లోపు తేలిపోనుంది.

భిన్నవాదలతో ఎన్నాళ్లు..: పాలకమండలిలో విద్యశాఖ కార్యదర్శి, కళాశాల విద్య కమిషనర్లు ప్రభుత్వం తరఫున ఎక్స్ అఫీషియో సభ్యులు ఉంటారు. ఉపకులపతికి, పాలకమండలికి మధ్య అభిప్రాయభేదాల నేపథ్యంలో సమావేశాలు జరుగుతున్న తీరు వివాదాస్పదం అవుతోంది. ఉపకులపతి హాజరుకావటం లేదు. ఎక్స్‌అఫీసియో హోదాలో పాల్గొంటున్న ఐఏఎస్‌లలో ఒకరు ఛైర్మన్‌గా సమావేశాలు జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాల చట్టానికి లోబడి ఈ విధంగా ముందుకెళ్తున్నామని వివరిస్తున్నారు. కాగా.. పాలకమండలికి ఛైర్మన్ హోదా ఉపకులపతిగా తనదే అని.. తాను లేకుండా సమావేశాలు నిర్వహించటం, తీర్మానాలు చేయటం చెల్లుబాటు కావనేది ఉపకులపతి వాదన. ఈ విషయంలో ఆయన కోర్టుకు వెళ్లి మరీ మధ్యంతర ఉత్తర్వులు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. సభ్యులు తాను లేకుండా ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదని ఆయన చెబుతున్నారు. ఈ మేరకు ఆయన ఓ లేఖనూ విడుదల చేశారు.

కొనసాగుతున్న గందరగోళం: ఉప కులపతి, పాలక మండలికి మధ్య విభేదాలు న్యాయస్థానం వరకు చేరటంతో వివాదం తీవ్ర రూపం దాల్చింది. ఇరువురు ఏకతాటిపైకి వచ్చి చర్చించే పరిస్థితులు కనిపించటం లేదు. ఉపకులపతి తనకు అధికారాలున్నాయని చెబుతూ రిజిస్ట్రార్‌ను నియమిస్తూ పోతున్నారు. పాలకమండలి ఇదే తరహాలో మరొకరిని నియమిస్తోంది. ఇలా ఎవరి దారి వారిదే అవుతున్న తరుణంలో వర్సిటీ పాలనలో గందరగోళం నెలకొంటోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో జరిగిన నిధుల వ్యయాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయనేది పాలకమండలి వాదన. అలాంటిదేమీ లేదని ఉపకులపతి చెప్పుకొస్తున్నారు. ఇందులో ఏది నిజం అని తేల్చితే కాని వివాదం ఒక కొలిక్కి రాదు. అది చేయాలంటే.. ప్రభుత్వం కల్పించుకోవాలి. అదే జరిగితే కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందనే చర్చ మొదలైంది. కోర్టులో మధ్యంతర ఉత్తర్వులపై పాలకమండలి వేసిన పిటీషన్ విచారణకు వచ్చాక గానీ చేసిన తీర్మానాల అమలుకు అడుగులు పడే పరిస్థితి కనిపించటం లేదు.

# సేవలకు ఆయుష్ తీరిందా..?




కామారెడ్డి: దీర్ఘకాలిక వ్యాధులను ఎదుర్కోవడానికి ఆయుర్వేద, హోమియో, యునానీలో మెరుగైన ఔషధాలు ఉన్నాయని ఆయుష్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో ఈ వైద్యశాలలపై పర్యవేక్షణ కొరవడి రోగులకు సేవలు అందడం లేదు. జిల్లాలో నేషనల్ రూరల్ హెల్త్ మిషన్(ఎన్ఆర్‌హెచ్ఎం)తో పాటు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఆయుర్వేద, యునానీ, హోమియో వైద్యశాలలు ఉండగా వీటిలో సిబ్బంది కొరత ఉంది. ఈ ఆసుపత్రుల్లో వైద్యులు నెలకు రెండు నుంచి మూడు రోజులు మాత్రమే విధులకు హజరవుతూ నామమాత్రంగా నిర్వహిస్తున్న తీరుపై

వైద్యం అటకెక్కుతోంది ఆయుష్ వైద్యశాలల్లో నిబంధనల ప్రకారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ సేవలందించి ఔషధాలు ఇవ్వాలి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు రోగులకు వైద్యసేవలు అందించాల్సి ఉంటుంది. కాని వైద్యులు నామమాత్రంగా సేవలందిస్తున్నారు. వైద్యులున్న వైద్యశాలల్లో ఫార్మాసిస్టును నియమించడం లేదు. ఫార్మాసిస్టు ఉన్న వైద్యశాలల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికి తోడు వైద్యశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేశారు.

ఇవీ ఘటనలు.. బాన్సువాడ ఆయుష్ వైద్యశాలలో ఓ వైద్యుడు కేవలం వారానికి ఒక్క రోజుమాత్రమే విధులకు హాజరవుతున్నట్లు ఆ శాఖ అధికారుల తనిఖీల్లో నిర్ధారణ అయింది. నాలుగేళ్లుగా ఇదే తీరున విధులు నిర్వహిస్తున్నట్లు వైద్యశాల సిబ్బంది అనధికారికంగా చెబుతున్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు వైద్యుడి పనితీరుపై జిల్లాస్థాయి అధికారులు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. నిబంధనల ప్రకారం వైద్యశాల పరిధిలోని పల్లెలతో పాటు పట్టణంలో క్యాంప్‌లు నిర్వహించాల్సి ఉంటుంది. నాలుగేళ్లుగా ఈ వైద్యుడి ఆధ్వర్యంలో ఒక్క క్యాంపు నిర్వహించిన దాఖలాలు లేవు. ఇటీవల కంటి వెలుగు విధులకు గైర్హాజరు కావడంతో జిల్లా పాలనాధికారి జితేష్ వి పాటిల్ ఈ వైద్యుడికి మెమో సైతం జారీచేసి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించారు. ఆ శాఖ ఉన్నతాధికారులతో మచ్చిక చేసుకొని చర్యలు లేకుండా చూసుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి.

పిట్లంలో ఎన్ఆర్‌హెచ్ఎం కింద విధులు నిర్వహిస్తున్న ఓ ఒప్పంద వైద్యుడు సైతం వారానికి ఒకటి రెండు రోజులే విధులు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ వైద్యుడికి ఎల్లారెడ్డి ఆయుష్ ఆసుపత్రి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించగా.. ఆయా ఆసుపత్రిలో గత ఏడాది కాలంగా ఓపీ నిర్వహించిన దాఖలాలు లేవు.

ఔషధాలు పంపిణీ చేయవద్దని ఆయుష్ వైద్యశాఖ నిర్దేశించిందని చెబుతూ.. రాజంపేట మండలం ఆర్గొండ ఆయుష్ వైద్యశాలలో ఫార్మాసిస్టు పదిరోజులకోసారి విధులకు హాజరవుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.ఫిర్యాదులపై చర్యలకు నివేదించాం– డాక్టర్ రవి నాయక్, ఆర్‌డీడీ, వరంగల్‌జిల్లాలోని ఆయుష్ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న కొందరు వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కాకపోవడంపై ఫిర్యాదులున్న మాట వాస్తవమే. బాన్సువాడ యునానీ వైద్యుడి పనితీరుపై పలు ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిబంధనలకు అనుగుణంగా ఆయుష్ పరిధిలోని విభాగాల వైద్యులు, సిబ్బంది విధులకు హాజరు కాకపోతే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలుంటాయి.

# లోతట్టుపై ముందుచూపు!

మహబూబ్‌నగర్: ఏటా భారీ వర్షాలకు పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ప్రతి ఏడాది ఈ సమస్య ఎదురవుతోంది. లోతట్టు ప్రాంతాలు మునకకు గురికాకుండా భద్రతా చర్యలు చేపట్టాలని సీడీఎంఏ కార్యాలయం నుంచి ఉమ్మడి జిల్లాలోని 19 పురపాలికల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలొచ్చాయి. మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నారాయణపేట, జడ్చర్ల, అయిజ, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి పాత పురపాలికలు కాగా భూత్పూర్, కోస్గి, మక్తల్, పెబ్బేరు, కొత్తకోట, అమరచింత, ఆత్మకూరు, అలంపూర్, వడ్డేపల్లి కొత్త బల్దియాలుగా అవతరించాయి. ఓమోస్తారు వర్షాలు కురిసినా ఇక్కడ ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. కొత్త పురాల్లో సమస్య అంత తీవ్రంగా లేకపోయినా వరద నీరు సవ్యంగా ముందుకెళ్లే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వర్షాలు కురిసినప్పుడే హడావిడి : పట్టణాధికారులు, పాలకవర్గాలు వర్షాలు కురిసినప్పుడు హడావిడి సృష్టించి తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. ఈసారి రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో వరద నుంచి ఉపశమనం కలుగుతుందో లేదో చూడాలి. ప్రధాన మురుగుకాలువలు, లోతట్టు ప్రాంతాల్లోని గుంతల్లో నీరు చేరకుండా నీటిని మళ్లించే చర్యలు, అంతర్గత కాలనీల్లో మురుగు కాలువల్లో పూడికతీత తదితర చర్యలు చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇవన్నీ పురాల్లో చేపడితే కనీసం కొంతలోకొంతైనా వరద ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం పుర అధికారులు మురుగు కాలువల్లో పూడికతీత చర్యలు చేపట్టారు.



ప్రధానంగా వరద ముంపునకు కారణమయ్యే ప్రాంతాల్లో ఈ పనులు వందశాతం చేపట్టాలని కసరత్తు చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి నేరుగా లోతట్టుకు నీరు రాకుండా మళ్లించే చర్యలు ఇంకా చేపట్టలేదు. చెరువులు, వాగులు, వంకలు ఆక్రమణకు గురైన ప్రాంతాల్లో వరద ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అలాంటి ప్రాంతాల్లో చర్యలు ప్రారంభించాల్సి ఉంది. ప్రస్తుతం మొదలుపెట్టిన పనులు త్వరగా పూర్తి చేయకపోతే ఈసారి ముప్పు తప్పదని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు.చర్యలు చేపడుతున్నాం : సీడీఎంఏ కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాలను పాటిస్తాం. ఏటా వరద ప్రాంతాల్లో చర్యలు చేపడుతన్నాం. ఈసారి ముందస్తుగా అయిజలో మురుగు కాలువల్లో పూడిక తీయిస్తున్నాం. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టిపెట్టి అక్కడ పనులకు ఉపక్రమించాం. పెద్దవాగు పరివాహక ప్రాంతాల్లో వరద నీరు రాకుండా చర్యలు తీసుకుంటాం.నర్సయ్య, అయిజ పుర కమిషనర్

# వేలిముద్రల ప్రొఫెసర్లు

హైదరాబాద్ :అత్యాధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం.. పరిశ్రమలకవసరమైన మానవ వనరులను విద్యాసంస్థల్లో తీర్చిదిద్దుతున్నామంటూ చెబుతున్న జేఎన్‌టీయూ ఉన్నతాధికారుల మాటలు నీటిమూటలయ్యాయి. జేఎన్‌టీయూ పరిధిలోని 214 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకుగాను 40 శాతం కళాశాలల్లో 'వేలిముద్రల' ప్రొఫెసర్లే ఎక్కువమంది ఉన్నారు. వీరు బయోమెట్రిక్‌లో హాజరు నమోదు చేసి వెళ్లిపోతారు. తరగతులు చెప్పరు. అనుబంధ హోదాను (అఫిలియేషన్) కాపాడుకునేందుకు కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తిచేసిన వారి విద్యార్హతలను కొంటున్నాయి. నిజ నిర్ధరణ కమిటీ తనిఖీల్లో ఇవన్నీ బహిర్గతం కావడం లేదు. ఫలితంగా ఈ ఏడాది బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 16 వేల మంది ఫెయిలయ్యారు.

రికార్డుల్లో గరిష్ఠ వేతనాలు..

కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధన సక్రమంగా లేదు. డిమాండ్ ఉన్న కోర్సులు, అత్యుత్తమ ఫ్యాకల్టీ, త్వరలో అటానమస్ (స్వయం ప్రతిపత్తి) వస్తుందనే ప్రచారంతో ఆకర్షిస్తున్నారు. డొనేషన్ల పేరుతో రూ.కోట్లు సంపాదించుకుంటున్నారు. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లను, సహ, సహాయ ఆచార్యులను నియమించుకోవడం లేదు. ప్రొఫెసర్లుగా వర్సిటీలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పదవీ విరమణ చేసిన వారిని, కళాశాల కొత్తగా ఏర్పాటు చేసినప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా చేరినవారికి మాత్రమే రూ.70 వేల–రూ.లక్ష జీతం ఇస్తున్నారు. సహ ఆచార్యులుగా పనిచేస్తున్నవారికి యూజీసీ పేస్కేల్ ప్రకారం ఇస్తున్నామంటూ వారికి ఆ మేరకు జీతాలు చెల్లిస్తున్నామని రికార్డుల్లో చూపుతున్నారు. వారి ఏటీఎం కార్డులను యాజమాన్య ప్రతినిధులు తమ వద్దే ఉంచుకుని ఖాతాల్లో అధిక జీతం జమ చేసి ఏటీఎం నుంచి విత్‌డ్రా చేసి రూ.50 వేలిచ్చి మిగిలిన మొత్తాన్ని తీసేసుకుంటున్నారు. ఎంటెక్, పీహెచ్‌డీ సర్టిఫికెట్లు ఇస్తే చాలు నెలకు రూ.15 వేల నుంచి రూ.18 వేల జీతం ఇస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలి. ఒక్కరోజు వేలిముద్ర వేయకపోతే ఆరోజు జీతం కట్.

అక్రమాలు ఇలా.. ఉన్నత విద్యామండలి కార్యాలయానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్లు లేరు. కంప్యూటర్ సైన్స్‌లో సహాయ ప్రొఫెసర్లున్నట్టు హాజరు పట్టీలో ఉంటాయి. ఆ ప్రొఫెసర్లు బయోమెట్రిక్‌లో వేలిముద్రలు వేసి కళాశాలలో సాయంత్రం వరకూ ఉండి మళ్లీ వేలిముద్రలు వేసి వెళ్తున్నారు. పంజాగుట్ట–ఖైరతాబాద్–ఆబిడ్స్ మార్గంలో ఉన్న పురాతన ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రతినిధులు ఎంటెక్ పూర్తిచేసిన వారికి నెలకు రూ.18 వేలు ఇస్తూ ఉదయం, సాయంత్రం వేలిముద్రలు వేయించి పంపుతున్నారు. హైదరాబాద్ శివారులోని పర్యాటక ప్రాంతానికి, ఖరీదైన రిసార్టుకు సమీపంలోని ఒక ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. యాజమాన్యాలు సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్‌లో పీజీ చేసిన వారికి రూ.70 వేలు జీతం ఇస్తున్నట్టు రికార్డుల్లో చూపించి వారికి రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఇస్తున్నారు.

జేఎన్‌టీయూకు 15 కిలోమీటర్ల పరిధిలో 4 ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో అఖిల భారత సాంకేతిక విద్యామండలి ప్రమాణాలకనుగుణంగా విద్యార్థుల ప్రొఫెసర్ల నిష్పత్తి లేదు. ఒక ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తిచేసినవారే ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు.

# పట్టాలెక్కనున్న పోడు!

పరిగి: పోడు భూములకు పట్టాలను అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల ప్రకటించారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే సమస్య పరిష్కారానికి కసరత్తు పూర్తిచేసింది. జూన్ 24నుంచి 30వ తేదీ వరకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వమే ముహూర్తాన్ని ఖరారు చేయడంతో పేదల చేతికి ఇక పట్టాలు అందనున్నాయి. భూములను సాగు చేసుకుంటున్న వారికి హక్కు పత్రాలను ఇస్తామని గతేడాది దరఖాస్తులను స్వీకరించిన సర్కారు క్షేత్రస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి అర్హులను వడపోత పట్టింది. దీంతో రైతులు పత్రాల కోసం అప్పటి నుంచి నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో సర్కారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది.వికారాబాద్ జిల్లాలోని పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని చాలా గ్రామాల్లో పోడు సమస్య ఉంది. మొత్తం జిల్లా వైశాల్యం 8,85,683 ఎకరాలు ఉండగా అటవీ వైశాల్యం 1,08,791.08 ఎకరాలు. అటవీ బ్లాకుల సంఖ్య 93. ఏడాదిన్నర క్రితం జిల్లా వ్యాప్తంగా సుమారు 23వేల ఎకరాలకు గాను 9703 దరఖాస్తులు అందాయి. వీటిలో గిరిజనుల నుంచి 4,692 దరఖాస్తులు అందగా ఇతరుల నుంచి 5,011 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన వాటిని క్షేత్రస్థాయిలో జల్లెడ పట్టిన అధికారులు జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో చివరకు 436 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరికి 552.30 ఎకరాల భూమిని ఖరారు చేసి పోడు పట్టాలను అందజేయనున్నారు. ఇందుకోసం అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో గిరిజనులతో పాటు గిరిజనేతరులు కూడా దశాబ్దాల తరబడి అటవీ భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. పోడు భూములు పట్టాలు పొందిన వారికి రైతుబంధు పథకం వర్తించనుంది. ప్రభుత్వమే బ్యాంకు ఖాతాలను తెరిచి యజమానులకు నేరుగా రైతుబంధును జమచేయనుంది. ఇకమీదట వారికి పంట రుణాలు కూడా అందనున్నాయి.

పది మండలాల్లో..: జిల్లాలోని 19 మండలాలు ఉండగా పోడు భూములకు పట్టాలను అందించేది పది మండలాల్లోని లబ్దిదారులకు. ప్రధానంగా యాలాల, పూడూరు, పెద్దేముల్, పరిగి, కుల్కచర్ల, కొడంగల్, దోమ, ధారూరు, చౌడాపూర్, బషీరాబాద్ మండలాలు ఉన్నాయి. దరఖాస్తులు మాత్రం వేలల్లో ఉండగా లబ్ధిదారుల సంఖ్య అందులో సగానికి సగం కూడా లేకపోవడంతో ఎవరెవరికి అందుతాయోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల సమస్యకు తెర

పోడు పట్టాల పంపిణీతో దశాబ్దాల సమస్యకు తెరపడనుంది. పంట సాగు చేసుకోవాలన్నా రుణం అందని పరిస్థితి. చివరకు అమ్ముకోవాలన్నా హక్కు పత్రాలు లేక పడుతున్న పాట్లు వర్ణనాతీతం. పంటసాగుకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధుకు దూరమే. రైతుబీమా కూడా వర్తించకపోవడంతో బాధిత కుటుంబాలకు రూ.5లక్షల సాయం కూడా అందకుండా పోతోంది. కనీసం ఇప్పటికైనా తమకు మేలు కలుగుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా ఎంపిక

కోటాజి, జిల్లా గిరిజన సంక్షేమాధికారిగ్రామసభల ద్వారా వచ్చిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ పారదర్శకంగా ఎంపిక ప్రక్రియను పూర్తి చేశాం. ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్హులైన వారికి పోడు పట్టాలు అందనున్నాయి.






భవిష్యత్తులో భారత్.. భూకక్ష్యలో సొంతంగా అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఇస్రో అంతరిక్షంలో కీలకమైన శక్తివనరుల వినియోగంపై ప్రయోగం చేపట్టింది. ఈ క్రమంలో సరికొత్త ఫ్యూయల్ సెల్‌ను సోమవారం విజయవంతంగా దిగువ భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. పీఎస్ఎల్వీ-సీ58 ప్రయోగ విజయంతో ఈ నూతన సంవత్సరాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఉత్సాహంగా ప్రారంభించింది. ఈ వాహకనౌకతో 'ఎక్స్-రే పొలారిమీటర్ ఉపగ్రహం' ను నేడు అంతరిక్షంలోకి పంపారు. ఇదే వాహకనౌక చివరి దశలో మరో పది పరికరాలను అంతరిక్షానికి మోసుకెళ్లి నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. వీటిలో ఫ్యూయల్ సెల్ పవర్ సిస్టమ్ కూడా ఒకటి. 'పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్'లో భాగంగా దీన్ని నింగిలోకి పంపించింది. ఈ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అభివృద్ధి చేసింది. రోదసిలో సమర్థవంతమైన సుస్థిర శక్తి వనరును భారత్‌కు అందించడానికి ఇది ఉపయోగపడుతుందని ఇస్రో వెల్లడించింది. ఈ టెక్నాలజీ.. రసాయన శక్తిని నేరుగా ఎలక్ట్రోకెమికల్ రియాక్షన్‌తో విద్యుత్ శక్తిగా మారుస్తుంది. సుదీర్ఘ కాలం పాటు అంతరిక్ష కేంద్రానికి కరెంట్‌ను ఇది సరఫరా చేయగలదు. భవిష్యత్తులో భారత్ నిర్మించబోయే స్పేస్ స్టేషన్ కోసం ఈ ప్రయోగం కీలక ముందడుగు.

రోదసిలో భారత్ సొంతంగా అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకునే దిశగా కేంద్రం ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే ఇటీవల ప్రధాని మోదీ కూడా దీనిపై మాట్లాడుతూ.. మరో పదేళ్లలో ఈ స్పేస్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేలా లక్ష్యం పెట్టుకోవాలని శాస్త్రవేత్తలకు దిశానిర్దేశం చేశారు.

**ఇది ఆరంభం మాత్రమే: సోమ్‌నాథ్ –** నేటి ప్రయోగంపై ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమ్‌నాథ్ మాట్లాడారు. "పీఎస్ఎల్వీ ప్రయోగ విజయంతో ఈ నూతన సంవత్సరాన్ని మొదలుపెట్టాం. ఎక్స్‌పోశాట్ ఉపగ్రహాన్ని ఈ వాహకనౌక విజయవతంగా నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇది ఆరంభం మాత్రమే. ఈ ఏడాది మరిన్ని కీలక ప్రయోగాలున్నాయి. ఈ 2024.. మిషన్ గగన్‌యాన్ సంవత్సరంగా నిలవనుంది" అని సోమ్‌నాథ్ ఆనందం వ్యక్తం చేశారు.

# బోర్డర్ పోస్టులకు అత్యాధునిక 4జీ సౌకర్యం: కేంద్ర హోంశాఖ

పొరుగుదేశాలతో సరిహద్దులు పంచుకొంటున్న ప్రాంతాల్లోని దాదాపు 1,117 బోర్డర్ పోస్టులకు అత్యాధునిక 4జీ మొబైల్ కమ్యూనికేషన్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. దీనికి సుమారు రూ.1,545.66 కోట్లు ఖర్చవుతాయని ఆ శాఖ తెలిపింది. ఈ మేరకు టెలికాం శాఖ, హోంశాఖ, బీఎస్ఎన్ఎల్ మధ్య త్రైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వెల్లడించింది. ఈ ప్రాజెక్టు వచ్చే ఆరున్నరేళ్లలో పూర్తి కానుంది. వీటిల్లో కొన్ని సాయుధ దళాలకు చెందిన ఇంటెలిజెన్స్ పోస్టులు కూడా ఉండనున్నాయి. కేంద్రం చేపట్టిన 4జీ సాచురేషన్ ప్రాజెక్టులో భాగంగా లద్దాఖ్‌లో మొత్తం 379 గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం వీటిల్లో తొమ్మిది గ్రామాల్లోనే పనులు పూర్తయ్యాయి. మరో 34 చోట్ల ప్రారంభ దశలో ఉన్నాయి. మయన్మార్‌తో 2.4 కి.మీ, పాక్‌తో ఉన్న 18 కి.మీ సరిహద్దులో గతేడాది ఫెన్సింగ్ పని కూడా పూర్తి చేశారు. ఇక 2023లో చైనా సరిహద్దుల్లో సరికొత్తగా 48.03 కిలోమీటర్ల రోడ్డు నిర్మించారు. దీంతోపాటు నాలుగు ఔట్ పోస్టులు, మూడు హెలిప్యాడ్లను సిద్ధం చేశారు. చైనాతో భారత్‌కు దాదాపు 3,488 కిలోమీటర్ల మేరకు సరిహద్దు ఉంది. సరిహద్దు గ్రామాల్లో అభివృద్ధిని వేగవంతం చేసినట్లు కేంద్ర హోంశాఖ పేర్కొంది. ఆయా గ్రామాలను మిగిలిన ప్రాంతాలతో అనుసంధానించడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, సంక్షేమ పథకాలు ఆ గ్రామాలకు చేరేలా పనిచేస్తున్నట్లు తెలిపింది. వైబ్రెంట్ విలేజ్ పథకం కింద సరిహద్దు గ్రామాల్లో నాణ్యమైన జీవనశైలిని అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొంది.




కాకినాడ: కాంగ్రెస్ పార్టీలో ఏపీ సీఎం జగన్ సోదరి వైఎస్ షర్మిల చేరబోతున్నారన్న వార్తల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడే గిడుగు రుద్రరాజు వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. నేడు అమలాపురంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నట్లు మొన్న ఢిల్లీలో జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే చెప్పారన్నారు. ఈ క్రమంలోనే వైసీపీకి చెందిన చాలామంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమకు టచ్‌లో ఉన్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 175 స్థానాల్లోనూ ఇండియా అలయన్స్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని గిడుగు రుద్రరాజు వెల్లడించారు. ఈ నెల 14 వ తేదీ నుంచి రాహుల్ గాంధీ మరో యాత్ర చేయనున్నారని పేర్కొన్నారు. త్వరలో చేపట్టబోయే స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి రాహుల్ గాంధీ ప్రియాంకతో పాటు కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు రానున్నారని గిడుగు రుద్రరాజు వెల్లడించారు. ఇప్పటికే మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి షర్మిలతోనే ఇక మీదట తన రాజకీయ ప్రయాణమని తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. అలాగే ఇప్పటి వరకూ జగన్ మెప్పు పొందడం కోసం కొందరు నేతలు టీడీపీ, జనసేన పార్టీలతో పాటు ఆ పార్టీల అగ్రనేతలను ఇష్టమొచ్చినట్టుగా దూషించారు. ఇప్పుడు కొందరు నేతల పరిస్థితి వైసీపీలో ఉండలేరు.. అలాగని టీడీపీ, జనసేనల్లోకి వెళ్లలేరు. ఈ క్రమంలోనే వారంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గిడుగు రుద్రరాజు వ్యాఖ్యలు ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయి.

# దేశ ప్రజలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు!



నూతన సంవత్సరం-2024 సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు అందరికీ శ్రేయస్సు, శాంతి, మంచి ఆరోగ్యం సమకూరాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. మైక్రో-బ్లాగింగ్ సైట్ 'ఎక్స్'(గతంలో ట్విట్టర్)లో 'ప్రతి ఒక్కరికీ 2024 అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఈ సంవత్సరం అందరికీ శ్రేయస్సు, శాంతి, మెరుగైన ఆరోగ్యం సమకూరాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 'అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2024 అందరికీ సంతోషాన్ని, శాంతిని, శ్రేయస్సును అందించాలని కోరుకుంటున్నాను. సమ్మిళిత, స్థిరమైన, అభివృద్ధికి దోహదపడే కొత్త నిబద్ధతతో నూతన సంవత్సరాన్ని స్వాగతిద్దాం' అని ఆమె 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఇలా రాశారు 'ప్రతి భారతీయునికి 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు. నూతన సంవత్సరం అందరికీ శాంతి, శ్రేయస్సు, ఆనందాన్ని అందించాలని కోరుకుంటున్నాను. భారతదేశ పురోగతి, శ్రేయస్సుకు దోహదపడే దృఢ నిబద్ధతతో నూతన సంవత్సరాన్ని ప్రారంభిద్దాం' అని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ '2024 నూతన సంవత్సరం సందర్భంగా అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అని రాశారు. భారతదేశంతో పాటు ప్రపంచమంతా 2024కు ఘనంగా స్వాగతం పలికింది.

# డిజిటల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన నారా భువనేశ్వరి



హైదరాబాద్: ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో డిజిటల్ క్యాలెండర్‌ను టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం ఉదయం ఆశిష్కరించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు భువనేశ్వరి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 53 రోజులు పాటు చంద్రబాబు కోసం నిలబడిన తెలుగు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కేసులకు భయపడకుండా ప్రజలు బయటకు వచ్చి తమకు అండగా నిలబడ్డారన్నారు. చంద్రబాబు కోసం నిలబడినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా మహిళలు తన మనస్సులో ఎప్పటకీ ఉండిపోతారన్నారు. ప్రపంచవ్యాప్తంగా చంద్రబాబు కోసం తెలుగు ప్రజలు నిలబడ్డారన్నారు. నూతన ఏడాదిలో అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో ప్రజలు అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. చిరునవ్వుతో రోజును ప్రారంభిస్తే లక్ష్యాన్ని సాధించవచ్చు అని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరికి సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# సీఎం వైయస్ జగన్‌కు టీటీడీ క్యాలెండర్, డైరీ అందజేత

## ముఖ్యమంత్రిని ఆశీర్వదించిన వేద పండితులు



తాడేపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి నివాసంలో వైయస్ జగన్‌కు టీటీడీ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదాలను, టీటీడీ క్యాలెండర్, డైరీలను అందించారు. అలాగే నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి నివాసంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు సీఎం వైయస్.జగన్‌ను వేద మంత్రోచ్చారణతో ఆశీర్వదించి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల రణరంగంలో ప్రజలే పాలకులుగా గెలవాలి

అమరావతి: రాష్ట్ర ప్రజలందరికీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడు ప్రకృతి ప్రకోపాలు, పాలకుల ప్రతాపాలు లేని కాలమవ్వాలన్నారు. కార్మిక, కర్షక శ్రేయస్సు వర్ధిల్లాలన్నారు.



ఎన్నికల రణరంగంలో ప్రజలే పాలకులుగా గెలవాలన్నారు. కుల, మత విద్వేషాలు లేని సమ సమాజం రావాలన్నారు. సకల శుభాలూ ప్రజలందరికీ బానిసవ్వాలని రామకృష్ణ పేర్కొన్నారు.

# పండగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ



అమరావతి: రాష్ట్రంలో పండగ వాతావరణంలో పెన్షన్ల పంపిణీ కొనసాగుతోంది. ఏపీలో రూ. 3 వేలకు పెరిగిన వైయస్ఆర్ పెన్షన్ కానుకను సోమవారం(జనవరి 1వ తేదీ) తెల్లవారుజాము నుంచే పంపిణీ చేస్తున్నారు వలంటీర్లు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ. 3వేలకు సీఎం వైయస్ జగన్ పెంచడంతో పెన్షన్ల దారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

కాగా, ఈనెల 3వ తేదీన కాకినాడలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో స్వయంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు.

# 175 కి 175 గెలుస్తామని అన్నం తిన్న వాళ్లెవరైనా అంటారా?

విశాఖపట్నం: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడు నెలలు తర్వాత ఏపీ ప్రజలకు సుఖ సంతోషాలు వస్తాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమి పాలై.. జగన్ ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయమని.. వైసీపీకి 20 సీట్లు మించిరావంటూ జోస్యం చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా జగన్ సర్వనాశనం చేశారని మండిపడ్డారు. అన్నింటి మీద పన్నులు వేసి... చెత్త సీఎంగా జగన్ పేరు తెచ్చుకున్నారన్నారు. దేశంలో అత్యధిక ధనిక సీఎం జగన్ అని వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో డబ్బుతో గెలవాలని చూస్తున్నారని.. ఆ పప్పులు ఉడకవన్నారు. 175 కి 175 గెలుస్తామని అన్నం తిన్న వాళ్ళు ఎవరైనా అంటారా? అని మండిపడ్డారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలవాలని ప్రజలు కోరుకుంటున్నారని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.

# ఈ ప్రయోగ విజయం 2024 కొత్త సంవత్సరానికి శుభారంభం




నెల్లూరు: నూతన సంవత్సరం రోజున ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ58 రాకెట్ ప్రయోగం విజయవంతమైన విషయం తెలిసిందే. దీనిపై ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ.. ఈ ప్రయోగ విజయం 2024 కొత్త సంవత్సరానికి శుభారంభమన్నారు. భూమికి 650 కిలోమీటర్ల దూరంలో నిర్ణిత కక్షలోకి ఎక్స్‌పోశాట్ చేరుకుందన్నారు. ఎక్స్‌పోశాట్ ఉపగ్రహం లోని సోలార్ ప్యానల్స్ విచ్చుకొని బ్యాటరీలను ఛార్జింగ్ చేసే పనిని ప్రారంభించిందని సోమనాథ్ తెలిపారు. 1963 తరువాత జరిగిన నేటి ప్రయోగ విజయంతో ఇస్రో 60 ఏళ్ళ చరిత్ర పూర్తి చేసుకుందన్నారు. నూతన సంవత్సరం రోజున ఈ రాకెట్ ప్రయోగ విజయం భారత ప్రజలకు ఇస్రో అందించిన బహుమతి అని సోమనాథ్ పేర్కొన్నారు. భవిష్యత్ ప్రయోగాలకు పరిశోధాత్మక ప్రయోజనాలకు ఈ ఉపగ్రహం కీలకమన్నారు. ఈ ఏడాదిలో పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలు ఉంటాయన్నారు. మానవ రహిత గగన్యాన్ ప్రయోగం కూడా ఈ ఏడాది ఉంటుందని సోమనాథ్ వెల్లడించారు.

# శ్రీశైలం ఆలయానికి పోటెత్తిన భక్తులు



నంద్యాల : శ్రీశైలం ఆలయానికి భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం మొదటిరోజు కావడంతో భక్తిశ్రద్ధలతో స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుంటున్నారు. వేకువజాము నుంచి పాతాళగంగలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. స్వామి అమ్మవారి దర్శనానికి సుమారు నాలుగు నుంచి ఐదు గంటల సమయం పడుతోంది. ఆలయ క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తుల రద్దీకి కారణంగా స్వామివారి గర్భాలయ అభిషేకాలు సామూహిక అభిషేకాలు స్పర్శ దర్శనాలను నిలుపుదల చేసినట్టు ఆలయ ఈఓ పెద్దిరాజు తెలిపారు. భక్తులందరికి స్వామివారి అలంకార దర్శనాన్ని దేవస్థానం కల్పించింది.

# డార్లింగ్ గురించి శ్రుతిహాసన్ మనసులో మాట!

డార్లింగ్ ప్రభాస్ తో పనిచేసిన హీరోయిన్లు అంతా ఆయన గురించి ప్రత్యేకంగా చెప్పుకొస్తుంటారు. ముఖ్యంగా ఆయన ఇంటి నుంచి వచ్చే ఫుడ్ గురించి చెప్పని హీరోయిన్ అంటూ ఉండదు. ఇప్పటికే శ్రుతి హాసన్ అలాంటి ఫుడ్ విషయాలు రివీల్ చేసేసింది. ఆయన ఇంటి రుచులు ఎంత బాగుంటాయో? తాను ఎంతగా ఆస్వాదించి రుచి చూసిందో చెప్పకనే చెప్పింది. మరి డార్లింగ్ గురించి ఆమె వ్యక్తిగతంగా మనసులో మాట ఏంటి? అంటే కూల్ అండ్ కామ్ గయ్ అంటోంది. 'ప్రభాస్ తెరపై చేసిన పాత్రలకంటే భిన్నంగా తన నిజ జీవితంలో ఉంటారు. చాలా కూల్ గా..కామ్ గా ప్రశాంతంగా ఉంటారు. సినిమాలో పాత్రల కోసం కష్టపడి పనిచేయడం..పాత్రలో ఒదిగిపోయే విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంటుంది. మంచి సహ నటుడు. స్వేచ్ఛగా ఉంటారు. ప్రేక్షకులు కోరుకునే దానికంటే



ఎక్కువగా అలరించగల నటుడాయన. యాక్షన్ సన్నివేశాల్లో మాత్రం తనలో భిన్నమైన ప్రభాస్ కనిపిస్తాడు. అప్పుడు అతనిలో ఇలాంటి మనిషి కూడా ఉన్నాడా? అనిపిస్తారు. ఆ స్థాయిలో ముఖంలో హావభావాలు కనిపిస్తాయి. ఆయన ఫేస్ సీరియస్ లుక్ లోనూ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. చిల్ అయ్యే సమయం లోనూ అంతకు మంచి సంతోషంగా ఉంటారు అని అంది. ఇక సలార్ లో శ్రుతి హాసన్ రోల్ చిన్నదిగా ఉండటం అభిమానుల్ని నిరాశ పరిచిన సంగతి తెలిసిందే. ప్రభాస్ తో ఎక్కువ సన్నివేశాలుంటే బాగుం డని అభిమానులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో 'సలార్ -2' లోనైనా హీరోయిన్ పాత్ర నిడివి పెంచుతారని..ఆమె పాత్ర కీలకంగా ఉండాలని కోరుకుంటున్నారు. మరి దర్శకుడు ప్రశాంత్ నీల్ ఆ రకమైన జాగ్రత్తలు ఏవైనా తీసుకుంటారా? అన్నది చూడలి.ఇక ఈ ఏడాది శ్రుతిహాసన్ 'వాల్తేరు వీరయ్య'..'వీరసింహారెడ్డి' ..'సలార్' విజయాలతో హ్యాట్రిక్ అందుకుని 2023ని సంతోషంగా ముగించి..2024 లోకి రెట్టించిన ఉత్సాహంతో అడుగు పెట్టబోతుంది. దీంతో అమ్మడు న్యూ ఇయర్ వేడుకలు ప్రత్యేకంగానూ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## నా సామిరంగ.. సడన్ ట్విస్ట్ ఇవ్వరుగా..?

ఇప్పుడు టాలీవుడ్ లో సంక్రాంతి సినిమాల సమస్య పెద్ద తలనొప్పిగా మారింది. ఎన్నడూలేనంతలా ఈసారి ఐదు తెలుగు సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో పోటీపడనున్నాయి. మహేశ్ బాబు గుంటూరు కారం, వెంకటేశ్ సైంధవ్, రవితేజ ఈగల్, తేజ సజ్జ హనుమాన్, నాగార్జున నా సామిరంగా సంక్రాంతి బరిలో నిలిచాయి. అయితే 2024 సంక్రాంతికి ఒక దశలో ఏకంగా అర డజను సినిమాలు షెడ్యూల్ అయ్యాయి. తర్వాత అందులోనుంచి విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ మూవీ తప్పుకుంది. కానీ మిగతా ఐదు సినిమాల్లో మాత్రం ఏదీ తగ్గేలా కనిపించడం లేదు. పక్కా సంక్రాంతికే రిలీజ్ చేస్తామని ప్రకటిస్తున్నారు మేకర్స్. దీంతో ఈ సినిమాలకు థియేటర్ల కేటాయింపు ఆషామాషీ విషయం కాదు. ఈ నేపథ్యంలోనే టాలీవుడ్ నిర్మాతల మండలి రంగంలోకి దిగింది. సంక్రాంతి బరిలో ఉన్న ఐదు సినిమాల నిర్మాతలతో సమావేశాన్ని నిర్వహించిన దిల్ రాజు.. అవకాశం ఉన్న



వాళ్లు తమ సినిమాను వాయిదా వేసుకోవాలని కోరారు. ఆ సమయంలో హనుమాన్ రిలీజ్ వాయిదా వేసుకోవాలని ఆ సినిమా దర్శక నిర్మాత ప్రశాంత్ వర్మపై దిల్ రాజు ఒత్తిడి తెచ్చినట్లు వార్తలు వచ్చాయి. కానీ తాము మాత్రం పక్కాగా జనవరి 12వ తేదీనే హనుమాన్ ను రిలీజ్ చేస్తామని ప్రశాంత్ వర్మ స్పష్టం చేశారట. ఇప్పటికే ప్రచారం కూడా ప్రారంభించామని, నార్త్ ఇండియా రిలీజ్ ను వదులుకోలేమని తెలిపారట. ఇదిలా ఉంటే.. ఇప్పుడు సినీవర్గాల్లో మరో వార్త చక్కర్లు కొడుతోంది. ఇప్పటి వరకు నాగార్జున నా సామిరంగా సినిమా ఫైనల్ కాపీ ఇంకా రెడీ అవ్వలేదట. ఓటీటీతోపాటు శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా ఇంకా కుదరలేదట. వీటన్నింటికీ ఇంకా టైమ్ పడుతుందట. అందుకే రిలీజ్ ను వాయిదా వేసుకోవాలని మిగతా డిస్ట్రిబ్యూటర్లు సూచిస్తున్నారట. అయితే సోగ్గాడే చిన్నినాయనా, బంగార్రాజు వంటి సినిమాలతో సంక్రాంతి సెంటిమెంట్ ను బాగా వాడుకున్న నాగార్జున.. ఇప్పుడు ఈ మూవీ రిలీజ్ వాయిదాకు ఒప్పుకోరని టాక్ వినిపిస్తోంది. మరేం జరుగుతుందో చూడాలి. ఇక ఈ సినిమా విషయానికొస్తే ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నాగార్జున సరసన ఆషిక రంగనాథ్ హీరోయిన్ గా నటిస్తున్నారు. యంగ్ హీరోలు అల్లరి నరేశ్, రాజ్ తరుణ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. చిట్టూరి శ్రీనివాస్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.




# గుంటూరు కారం కోసం చెప్పవే చిరుగాలి..!




సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యాన్స్ తో పాటు తెలుగు సినీ ప్రేక్షకులు మరియు ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రం 'గుంటూరు కారం'. ఈ సంక్రాంతికి ఎన్ని సినిమాలు రాబోతున్నా కూడా ఎక్కువ శాతం మంది ఛాయిస్ గుంటూరు కారం అయ్యి ఉంటుంది అంటూ సూపర్ ఫ్యాన్స్ చాలా నమ్మకంగా మాట్లాడుకుంటూ ఉన్నారు. గుంటూరు కారం సినిమాతో సూపర్ హిట్ కొట్టేందుకు దర్శకుడు త్రివిక్రమ్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. షూటింగ్ పూర్తి అయ్యి ఎప్పుడో రావాల్సిన ఉన్నా కూడా పలు కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు సంక్రాంతి కానుకగా రాబోతున్న గుంటూరు కారం సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం ఖాయం అంటూ ఫ్యాన్స్ ధీమాగా ఎదురు చూస్తున్నారు. ఇక గుంటూరు కారం సినిమా గురించిన విషయాలు, విశేషాలు అంచనాలను భారీగా పెంచుతున్నాయి. తాజాగా మహేష్ బాబు సూపర్ హిట్ మూవీ ఒక్కడు లోని చెప్పవే చిరుగాలి పాట బిట్ ను గుంటూరు కారంలో పెట్టినట్టు సమాచారం అందుతోంది. ఆ పాట వచ్చినప్పుడు కచ్చితంగా మహేష్ ఫ్యాన్స్ కేకలు వేయడం ఖాయంగా యూనిట్ సభ్యులు చెబుతున్నారు. సినిమాలో అత్యంత కీలకమైన సమయంలో ఆ పాట రావడం ద్వారా సినిమా ను మరింత హై కి దర్శకుడు తీసుకు వెళ్లే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం ను తీసుకున్నాడు అంటూ యూనిట్ సభ్యుల ద్వారా సమాచారం అందుతోంది. మొత్తానికి గుంటూరు కారంలో ఒక్కడు రిఫరెన్స్ ఉండబోతుంది అనే ప్రచారం అంచనాలను మరింత పెంచుతుంది. శ్రీలీల హీరోయిన్ గా నటించిన ఈ సినిమాలో మరో హీరోయిన్ గా మీనాక్షి చౌదరి కనిపించబోతుంది. థమన్ అందించిన సంగీతం ఇప్పటికే మహేష్ బాబు ఫ్యాన్స్ ను ఉ ర్రూతలూగిస్తూ ఉన్నాయి. సినిమా విడుదల తర్వాత పాటలు మరింత పాపులర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# నచ్చని రంగులో నమ్రత..ఎందుకంటే?



ఏ పనైనా నచ్చితేనే చేయాలి..ఏ డ్రెస్ అయినా సరే మనసుకు నచ్చితేనే వేసుకోవాలి. కానీ నచ్చని పని... నచ్చని డ్రెస్ కూడా వేసుకోవాల్సిన సందర్భాలంటూ కొన్ని ఉంటాయి. అలాంటప్పుడు తప్పదు. నచ్చని పనైనా తప్పక చేయాలి. నచ్చని డ్రెస్ అయినా తప్పని పరిస్థితుల్లో ధరించాలి. తాజాగా సూపర్ స్టార్ మహేష్ సతీమణి మనసుకు నచ్చని రంగు గల డ్రెస్ ని ధరించారు. డార్క్ బ్లూ అండ్ బ్లాక్ ఔట్ ఫిట్ లో నమ్రత తళుక్కున మెరిసారు. టాప్ టూ బాటమ్ నమ్రత అదే డ్రెస్ లో కనిపిస్తున్నారు. ఇక డ్రెస్ పై ఎలాంటి డిజైన్ కూడా లేదు. కొన్నిసార్లు ఇది నాకు నచ్చే రంగు కాదు..కానీ వేసుకున్నాను అని అర్దం వచ్చేలా ఆ డ్రెస్ ని ఉద్దేశించి పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఆ ఫోస్ట్ నెట్టింట వైరల్ అవుతుంది. అయితే అంతగా నచ్చని డ్రెస్ ఎందుకు వేసుకున్నారు? అని అభిమానులు అడుగుతున్నారు. కానీ నమ్రత నుంచి మాత్రం ఎలాంటి రిప్లై రాలేదు. ఇక నమ్రత ముస్తాబైన విధానం మాత్రం అభిమానుల్ని అలరిస్తుంది. ఆ డ్రెస్ ఆమెకి నచ్చకపోయినా అభిమానులకు నచ్చింది. ఔట్ ఫిట్ లో ఆమె ఎంతో అందంగా ఉన్నారంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ముఖ్యంగా ఆమె హెయిర్ స్టైల్...లుకింగ్ స్టైల్...కెమెరాకి ఇచ్చిన భంగిమ సూపర్బ్ అంటూ కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం నమ్రత న్యూ ఇయర్ సెలబ్రేషన్ల కోసం దుబాయ్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ రోజు ఉ దయమే ఫ్లైట్ ఎక్కారు. అయితే ఈ పిక్ పాతదిలా తెలుస్తుంది. జర్నీలో ఇలా టైం పాస్ గా పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఆమె ఎంత యాక్టివ్ గా ఉంటారో చెప్పాల్సిన పనిలేదు.

# అనుకున్నట్లే మంచి ప్రాజెక్ట్ పట్టేసిన బేబీ

టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన దిల్ రాజు ఓవైపు బడా హీరోలతో సినిమాలు చేస్తూనే మరోవైపు వైవిధ్యమైన కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలను సైతం ప్రోత్సహిస్తూ ఉంటారు. ఎంకరేజ్ చేయడంలో ఎప్పుడూ ముందే ఉంటారు. ఓవైపు తన సొంత బ్యానర్ వెంకటేశ్వర క్రియేషన్స్ పై భారీ బడ్జెట్ సినిమాలు నిర్మిస్తూనే మరోవైపు దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ పై డిఫరెంట్ మూవీస్ ని రూపొందిస్తున్నారు. ఈ నిర్మాణ సంస్థలో మొదటగా రూపొందిన 'బలగం' మూవీ ఎంత పెద్ద సక్సెస్ అయిందో తెలిసిందే. ఇక తాజాగా దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ పై శిరీష్ సమర్పణలో దిల్ రాజు అన్న కొడుకు ఆశిష్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్సిత, నాగమల్లిడి నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో శిరీష్ సరసన బేబీ మూవీ ఫేమ్ వైష్ణవి చైతన్య హీరోయిన్ గా నటిస్తోంది. ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం. ఎం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా నేషనల్ అవార్డు విన్నర్ పి.సి శ్రీరామ్ సినిమాటోగ్రాఫర్ గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకి సంబంధించి మరిన్ని



వివరాలను మేకర్స్ తెలియజేయనున్నారు. కాగా ఆశిష్ రెడ్డి 'రౌడీ బాయ్స్' అనే సినిమాతో టాలీవుడ్ కి హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. ఆ మూవీ ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. దీనితో తన సోదరుడి కొడుకుని హీరోగా నిలబెట్టాలని దిల్ రాజు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. ఓ డిఫరెంట్ యూత్ ఫుల్ లవ్ స్టోరీ గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'లవ్ మీ' అనే టైటిల్ ని మేకర్స్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. బేబీ సినిమాతో హీరోయిన్గా పరిచయమైన వైష్ణవి చైతన్యకి మూడవ సినిమానే దిల్ రాజు లాంటి పెద్ద బ్యానర్ లో ఛాన్స్ రావడం విశేషం. బేబీ మూవీలో తన పర్ఫామెన్స్ తో యూత్ ని విపరీతంగా ఆకట్టుకున్న వైష్ణవి చైతన్య ఆనంద్ దేవరకొండ తో మరో సినిమా చేస్తోంది. ఆ ప్రాజెక్టును ఇటీవలే అఫీషియల్ గా అనౌన్స్ చేసారు. ఇక ఇప్పుడు దిల్ రాజు బ్యానర్లో ఆశిష్ రెడ్డికి జోడిగా నటిస్తుండడంతో ఒక్కసారిగా ఈ ప్రాజెక్టుపై ఆడియన్స్ లో ఆసక్తి పెరిగింది. ఇక ఆశిష్ రెడ్డి ప్రస్తుతం 'సెల్ఫిష్' అనే సినిమాలో నటిస్తున్నాడు. లవ్ టుడే మూవీ ఫేమ్ ఇవానా ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# చెప్పులకు మరీ అంత ఎందుకు కియారా?

ఎంఎస్ ధోని సినిమాతో హిందీ ప్రేక్షకులకు దగ్గరయిన ముద్దుగుమ్మ కియారా అద్వానీ. తెలుగు లో భరత్ అనే నేను సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడం తో వెంటనే రామ్ చరణ్ కి జోడీగా వినయ విధేయ రామ సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఆ సినిమా నిరాశ పరచడంతో బాలీవుడ్ కి పరిమితం అయింది. బాలీవుడ్ లో ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తూనే మరో వైపు ఈమె తెలుగు లో రామ్ చరణ్ కి జోడీగా శంకర్ దర్శకత్వం లో గేమ్ చేంజర్ సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ప్రస్తుతం హిందీలో ఈ అమ్మడు సత్యప్రేమ్ కి కథ అనే సినిమా లో కూడా నటిస్తున్న విషయం తెల్సిందే. కియారా అద్వానీ ఈ ఏడాది గూగుల్ లో అత్యధికంగా వెతకబడిన బాలీవుడ్ సెలబ్రిటీగా నిలిచిన విషయం తెల్సిందే. ప్రేమ మరియు పెళ్లి విషయాలపై నెటిజన్స్ ఆసక్తి చూపించి గూగుల్ లో వెతకడం జరిగింది. ఇప్పుడు కియారా చెప్పుల గురించి నెటిజన్స్ మాట్లాడుకుంటూ ఉన్నారు.



తాజాగా కియారా తన భర్త సిద్దార్థ్ మల్హోత్ర తో ఉన్న ఫోటోను షేర్ చేసింది. ఆ ఫోటో లో కియారా ధరించిన చెప్పుల ధర అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ ప్రత్యేకమైన చెప్పులకు రూ. 88 వేలుగా నెట్టింట ప్రచారం జరుగుతోంది. బాబోయ్ ఇంత రేటు ఎందుకు అంటూ చాలా మంది కూడా ముక్కున వేలేసుకుంటున్నారు. స్టార్ స్టేటస్ ఉన్న సెలబ్రిటీల డ్రెస్ లు మరియు చెప్పులకు వేలకు వేల రూపాయల ధరలు ఉండటం చాలా కామన్ విషయం అంటూ కొందరు కియారా చెప్పుల ధరలను లైట్ తీసుకుంటూ ఉంటే మరి కొందరు మాత్రం బాబోయ్ అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు.



# కార్మికులతో కేటీఆర్ భోజనం

పారిశుధ్య కార్మికులతో కలిసి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మధ్యాహ్న భోజనం చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా తెలంగాణ భవన్‌లో పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. వారితో కాసేపు ముచ్చటించిన కేటీఆర్.. కలిసి భోజనం చేశారు. కార్మికులతో సెల్ఫీలు దిగారు.



# PSLV-C58 విజయవంతం

శ్రీహరికోట: కొత్త సంవత్సరాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో విజయోత్సాహంతో ప్రారంభించింది. తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ-సీ58 వాహకనౌక 'ఎక్స్-రే పోలారిమీటర్ ఉపగ్రహం'తో సోమవారం ఉదయం 9:10 గంటలకు నింగిలోకి దూసుకెళ్లింది. ఆదివారం ఉదయం 8:10 గంటలకు ప్రారంభమైన 25 గంటల కౌంట్‌డౌన్ అనంతరం షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ రాకెట్ బయలుదేరింది.

**పేలోడ్లు ఇవే..** ఇందులో మన దేశానికి చెందిన 480 కిలోల బరువు గల %శూశీఫ్%ను అంతరిక్షంలోకి పంపారు. ప్రయోగం తర్వాత 21 నిమిషాలకు ఎక్స్‌పోశాట్ నిర్ణీత కక్ష్యలోకి చేరుకుంది. ఇందులో తిరువనంతపురం ఎల్‌బీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ విమెన్ కాలేజ్ విద్యార్థినులు తయారుచేసిన విమెన్ ఇంజినీర్డ్ శాటిలైట్ సహా వివిధ ఉపకరణాలు కూడా ఉన్నాయి. వీటి సాయంతో శాస్త్రవేత్తలు పలు అంశాలపై అధ్యయనం చేయనున్నారు.

**ఎక్స్‌పోశాట్ లక్ష్యం..** ఎక్స్‌పోశాట్ భారతదేశం అంతరిక్ష ఆధారిత ఎక్స్-రే ఖగోళ శాస్త్రంలో సంచలనాత్మక పురోగతికి నాంది కానుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇమేజింగ్, టైం-డొమైన్ అధ్యయనాలు, స్పెక్ట్రోస్కోపీపై ప్రధానంగా దృష్టి సారించిన మునుపటి మిషన్ల మాదిరిగా కాకుండా.. ఎక్స్-రే ఖగోళ శాస్త్రానికి ఒక కొత్త కోణాన్ని పరిచయం చేస్తుందన్నారు. ఎక్స్-రే మూలాలను అన్వేషించడం ఎక్స్‌పోశాట్ లక్ష్యమని వివరించారు. ఇలాంటి ప్రయోగం చేయడం అమెరికాకు చెందిన అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా తర్వాత మనేమనని వెల్లడించారు. అగ్రరాజ్యం 2021లో ఐఎక్స్‌పీఈ పేరిట ఈ తరహా ప్రయోగం నిర్వహించినట్లు తెలిపారు. ఎక్స్‌పోశాట్ జీవితకాలం అయిదేళ్లు. కృష్ణబిలాలను అర్థం చేసుకోవడం ఈ మిషన్ ప్రధాన ఉద్దేశం. ఎక్స్‌రే ఫోటాన్లు, వాటి పోలరైజేషన్‌పై అధ్యయనం ద్వారా కృష్ణబిలాలు, న్యూట్రాన్ స్టార్ల దగ్గర రేడియేషన్‌కు సంబంధించిన వివరాలను ఎక్స్‌పోశాట్ బహిర్గతం చేస్తుంది.

**చివరి దశలో POEM..** పీఎస్ఎల్‌వీ చివరి దశలో మరో పది పరికరాలను అంతరిక్షానికి మోసుకెళ్లి నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టింది. దీనికి 'పీఎస్ఎల్‌వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్' అని నామకరణం చేశారు. దీంట్లోనే తిరువనంతపురం ఎల్‌బీఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ విమెన్ కాలేజ్ విద్యార్థినులు తయారుచేసిన విమెన్ ఇంజినీర్డ్ శాటిలైట్‌ను ఉంచారు.



# వామ్మో.. నిన్నొక్కరోజే ఇంత తాగేశారా?

## మద్యం అమ్మకాల్లో దుమ్మురేపిన తెలంగాణ

హైదరాబాద్: పండగ ఏదైనా తెలంగాణలో బీర్లు పొంగాల్సిందే. ఇక న్యూఇయర్ అయితే అమ్మకాలు ఏ రేంజ్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం అమ్మకాల్లో తెలంగాణ దుమ్మురేపింది. నిన్న ఒక్కరోజే 19 ప్రభుత్వ డిపోల నుంచి లక్ష 30 వేల కేసుల లిక్కర్, లక్ష 35 వేల కేసుల బీర్ అమ్మకాలు జరిగాయట. నిన్న ఒక్కరోజే ప్రభుత్వానికి రూ.125 కోట్ల ఆదాయం సమకూరిందట. ఈ సారి డిసెంబర్ 31 ఆదివారం కావడంతో మధ్యాహ్నం నుంచే వైన్స్‌ల వద్ద రద్దీ కనిపించింది. మూడు రోజుల్లో లిక్కర్ అమ్మకాలు ఆకాశాన్నంటాయి. డిసెంబర్ 29, 30, 31వ తేదీల్లో రూ.658 కోట్ల లిక్కర్ అమ్మకాలు జరిగినట్లు సమాచారం.

మొత్తంగా 3 రోజుల్లో 4.76 లక్షల లిక్కర్ కేసులు... 6.31 లక్షల బీర్ కేసులు అమ్ముడయ్యాయి. ఈ మూడు రోజుల్లో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం వచ్చింది.




# మూడు కమిషనరేట్‌లు.. 3 వేలకుపైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల వేళ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వ్యాప్తంగా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు మహిళలు సహా 1239 మందిపై కేసుల నమోదు చేశారు. 938 ద్విచక్ర వాహనాలు, 21 ఆటోలు, 275 కార్లు, 7 భారీ వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1500లకు పైగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాచకొండ పరిధిలో 517 మందిపై కేసులు నమోదయ్యాయి. తనిఖీల్లో పోలీసులతో పలుచోట్ల వాహనదారులు వాగ్వాదానికి దిగారు.



# విలీనం అసాధ్యం.. కిమ్ ప్రకటన


అమెరికా, దక్షిణ కొరియా దేశాలు కవ్విస్తే.. వాటిని నాశనం చేయడానికి సిద్ధంగా ఉండాలని ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సైన్యానికి పిలుపునిచ్చారు. ఇక నుంచి ద.కొరియాతో ఎటువంటి సయోధ్య, పునరేకీకరణ ప్రయత్నాలు ఉండవని తెగేసి చెప్పారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు శత్రుదేశాల మధ్య మాదిరిగా మారాయని అభివర్ణించారు. ఈ విషయాన్ని ఆ దేశ జాతీయ మీడియా వెల్లడించింది. ముఖ్యంగా అమెరికా వైపు నుంచి వచ్చే ముప్పును కాచుకొని ఉండాలని ఆయన సూచించారు. 2024లో అమెరికా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయుధ పరీక్షలను మరింత వేగవంతం చేయాలని కిమ్ భావిస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఆయన నిన్న మిలటరీ కమాండర్ల మీటింగ్‌లో మాట్లాడుతూ.. "వాస్తవాన్ని గుర్తించి దక్షిణ కొరియాతో మా సంబంధాలపై స్పష్టతనివ్వాల్సిన సమయం వచ్చింది. ఒక వేళ వాషింగ్టన్, సియోల్ సైనిక ఘర్షణకు ప్రయత్నిస్తే.. మా వద్ద ఉన్న అణ్వాయుధాలు కూడా వాడటానికి వెనుకాడబోం. మా దేశాన్ని ప్రధాన శత్రువుగా ప్రకటించి.. మా ప్రభుత్వాన్ని కూల్చేందుకు అవకాశం కోసం చూస్తున్న ప్రజలతో ఎటువంటి సంబంధాలు కొనసాగించం' అని స్పష్టం చేశారు. వాస్తవానికి 1953లో సైనిక ఘర్షణ నిలిచిన నాటి నుంచి ఇరు దేశాలు విడిపోయాయి. కానీ, ఎటువంటి యుద్ధ విరమణ ప్రకటన వెలువడలేదు. దీంతో సాంకేతికంగా మాత్రం రెండు దేశాల మధ్య యుద్ధం జరుగుతున్నట్లే లెక్క. ఇరు దేశాలు ఎప్పటికైనా విలీనం కావాలని లక్ష్యంగా పెట్టుకొన్నాయి. చాలా కాలం వీటి సంబంధాలు ఉద్రిక్తంగానే సాగాయి. కానీ, కిమ్ అధికారం చేపట్టాక.. ఇవి పతాక స్థాయికి చేరాయి. తాజాగా కిమ్ ప్రకటనతో పునరేకీకరణ అసాధ్యమని తేలిపోయింది. భవిష్యత్తులో దక్షిణ కొరియా పాలకులు శాంతి ప్రతిపాదనలు చేసినా.. ఉత్తర కొరియా తిరస్కరించడం ఖాయం. ఆసియాలో ఘర్షణలు మరింత పెరగవచ్చు. కొరియా ద్వీపకల్పంలో కిమ్ ప్రకటన అత్యంత కీలక పరిణామం. గత వారం కిమ్ జోంగ్ ఉన్ దేశంలోని ఆయుధ తయారీదారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అమెరికాతో ఎటువంటి ఘర్షణ తలెత్తినా.. తట్టుకొనే విధంగా తయారీని వేగవంతం చేయాలని సూచించారు. ఈ విషయాన్ని అక్కడి జాతీయ మీడియా కేసీఎన్ఏ వెల్లడించింది. అమెరికా కారణంగా కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలు పెరిగిపోయాయని ఆరోపించింది.




# బాలయ్య న్యూ ఇయర్ వేడుకలు

## బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో బాలకృష్ణ కొత్త సంవత్సరం వేడుకలు

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో నిర్వహించిన కొత్త సంవత్సరం వేడుకల్లో ప్రముఖ నటుడు బాలకృష్ణ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి స్వయంగా చిన్నారులకు తినిపించారు. వారికి పుస్తకాలను అందించారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.




తెలుగు ప్రజలకు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం సందర్భంగా తిరుమల శ్రీవారిని ఆమె దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.



# తిరుమల శ్రీవారి సేవలో..


కొత్త సంవత్సరం వేళ తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో విశాఖ శారద పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి, తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినీ నటుడు సుమన్‌లు.. స్వామివారి దర్శనం చేసుకున్నారు. టీటీడీ ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# కొత్త సంవత్సరాన యాదాద్రికి పోటెత్తిన భక్తులు



యాదాద్రి: నూతన సంవత్సరం సందర్భంగా యాదగిరి గుట్టకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఈ క్రమంలో స్వామి వారి ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. అలాగే ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంటన్నర సమయం పడుతోంది. స్వామి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు.

# జైలుకు వెళ్లేందుకూ సిద్ధంగా ఉండండి.. కార్యకర్తలతో కేజ్రీవాల్



దిల్లీ: ప్రజా శ్రేయస్సు కోసం తాము ఎంచుకున్న మార్గంలో జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉండాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములుగా చేయడంతో తమ పార్టీ ప్రజాదరణ పొందిందని కేజ్రీవాల్ అన్నారు. ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్న పార్టీ నేతలను చూసి గర్వంగా ఉందన్నారు. "పిల్లలకు ఉన్నతమైన విద్య, పేదలకు ఉచిత వైద్యం గురించి మాట్లాడితే మనం జైలుకు వెళ్లాల్సిందే. అందుకు మనం సిద్ధంగా ఉండాలి. మనం సమస్యలను ఎదుర్కొంటున్నామని భావిస్తున్నా. కానీ, అందుకు బాధపడనవసరం లేదు. ఈ రోజు జైలులో ఉన్న మన నేతలే మన హీరోలు. వారందరినీ చూసి చాలా గర్వపడుతున్నా" అని అన్నారు. కేంద్రంలోని భాజపా దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని తమ పార్టీ నేతలను జైలుకు పంపిందని ఆరోపిస్తూ ఆయన పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని ఏ ఇతర పార్టీలు దృష్టి సారించని సమస్యలపై తమ పార్టీ దృష్టి కేంద్రీకరించిందని అన్నారు. దేశంలో మొదటిసారి ప్రజలకు తమ పార్టీ ప్రత్యామ్నాయంగా మారిందన్నారు. ఇలాంటి రాజకీయాలను ప్రజలు ఇష్టపడడం ప్రారంభించారన్నారు.

# కుమారుడి వివాహంపై షర్మిల ట్వీట్

హైదరాబాద్: ఫిబ్రవరి 17న తన కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహం జరగనున్నట్లు వైతెపా అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వెల్లడించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. అట్లూరి ప్రియాతో రాజారెడ్డికి వివాహం జరగనున్నట్లు తెలిపారు. "అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. నా కుమారుడు రాజారెడ్డికి అట్లూరి ప్రియా తో జనవరి 18న నిశ్చితార్థ వేడుక నిర్వహించనున్నాం. ఫిబ్రవరి 17న వివాహం జరగనున్న సంగతి మీతో పంచు కోవడం ఆనందంగా ఉంది. మంగళవారం మేము కుటుంబ సమేతంగా కాబోయే వధూవరులతో కలిసి ఇడుపులపా యలోని వైఎస్‌ఆర్ ఘాట్‌ని సందర్శిస్తాం. తొలి ఆహ్వాన పత్రికను అక్కడ ఉంచి నాన్న ఆశీస్సులు తీసుకుంటాం" అని షర్మిల పేర్కొన్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com